నిరాశ నిస్పృహ



• నిర్మలమ్మ బడ్జెట్‌పై అన్నివర్గాల్లో అసహనం

కేంద్ర విత్త మంత్రి నిర్మలా సీతా రామన్ ప్రవేశపెట్టిన మధ్యంతర బడ్జెట్‌పై అన్ని వర్గాల ప్రజల్లో నిరాశ, నిస్పృహ నెలకొంది. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో నిర్మలమ్మ వరాలు కురిపిస్తుందని అందరూ భావించారు. అయితే, అందుకు భిన్నంగా బడ్జెట్ ఉండటంతో వేతనజీవులు, అన్నదాతలు, పింఛనర్లు తదితర వర్గాలు నిరాశ చెందాయి. పూర్తిస్థాయిలో బడ్జెట్ వివరాలు తెలియకపోయినా సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారిన అంశాలను తెలుసుకుని అసహనం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు 'ఆంధ్రజ్యోతి'తో తమ అభిప్రాయాలు వ్యక్తం చేశారు.

- నెల్లూరు (హరనాథపురం)

వేతన జీవులకు తీవ్ర నిరాశ



కేంద్ర బడ్జెట్ సామాన్య వేతన జీవులకు తీవ్ర నిరాశ కలిగించింది. పెరిగిన ధరలు, ప్రస్తుత ద్రవ్యోల్బణాన్ని దృష్టిలో ఉంచుకొని పాత పన్ను విధానంలో మార్పులు చేసి ఉంటే మధ్యతరగతి, సామాన్య వేతన జీవులకు మేలు చేకూరి ఉండేది. విద్యారంగానికి ఆశించిన స్థాయిలో నిధులు కేటాయించలేదు. సేవింగ్స్ పరిమితిని రూ. 2.5లక్షలకు పెంచుతారనుకొంటే అదీనూలేదు.

- అల్లంపాటి సురేంద్రరెడ్డి, ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు

ఈపీఎఫ్ పెన్షన్ దారులకు నిరాశ



కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ దేశవ్యాప్తంగా ఉన్న 60 లక్షల మంది ఈపీఎఫ్ పెన్షన్‌దారులను నిరాశకు గురిచేసింది. నెలకు రూ.వెయ్యి నుంచి రూ.3000 పెన్షన్ పొందుతూ అంతా దుర్భర జీవితం గడుపుతున్నారు. వారి పెన్షన్‌ను పెంచాలి.

- ఎం. కాంతారావు, విశ్రాంత ఉద్యోగి, ఎన్‌డీసీసీబీ


పేదల బడ్జెట్



పార్లమెంటులో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ పేదలకు ఎంతో ఉపయోగకరంగా ఉంది. రైతులకు కూడా మేలు చేకూరుతుంది. 2047 నాటికి రికసిత్ భారత్ సాధిస్తాం అని చెప్పటం ఆనందదాయకం.

- ఎస్. రేఖారాణి, న్యాయవాది

వైద్యఖర్చుల మినహాయింపు ఏదీ!?



నూతన పన్ను విధానంలో పెరుగుతున్న వైద్య ఖర్చులను దృష్టిలో పెట్టు కోలేదు. ఖర్చులను దృష్టిలో పెట్టుకొని పెన్షనర్లకు ప్రత్యేక వైద్య ఖర్చుల మినహా యింపు ప్రకటించి ఉంటే బాగుండేది.

- పాముల సాయి ప్రసాద్, రిటైర్డు తెలుగు అధ్యాపకులు

ఆయుష్మాన్ భారత్‌కు భారీ కేటాయింపు



ఆయుష్మాన్ భారత్‌కు బడ్జెట్‌లో రూ.7500 కోట్లు కేటాయించడం హర్షదాయకం. అలాగే ఆహార, ప్రజా పంపిణీ వ్యవస్థకు బడ్జెట్‌లో రూ.2.13 లక్షల కోట్ల కేటాయింపు బాగుంది. ప్రత్యక్ష, పరోక్ష పన్నుల్లో ఎలాంటి మార్పు చేయలేదు. పేదలకు ఎలాంటి గ్యారెంటీ లేని రుణాలు అందిస్తామని చెప్పడం హర్షదాయకం.

-వి. సత్యనారాయణ, అధ్యక్షుడు, నెల్లూరు ఆటోమొబైల్ డీలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

ఉద్యోగులకు ఒరిగిందేమిలేదు



పాత పన్ను విధానంలో 80 సీసీ కింద మినహాయింపు పెంపు ఉంటుందని ఆశించాము. పాత, కొత్త పన్ను విధానాలు రెండింటిలోనూ గత సంవత్సరంతో పోలిస్తే మార్పులు లేవు. ఈ బడ్జెట్ వల్ల ఉద్యోగులకు ఒరిగిందేమీ లేదు.

- వై. రమణారెడ్డి, ఏపీజీఈఏ జిల్లా అధ్యక్షుడు

రైతులను నిరాశ పరచిన బడ్జెట్



కేంద్ర బడ్జెట్ వ్యవసాయ రంగాన్ని, రైతులను తీవ్ర నిరాశ పరచింది. దేశ జనాభాలో 60శాతం ఆధారపడ్డ వ్యవసాయ రంగాన్ని నిర్లక్ష్యం చేయడం సరికాదు. బడ్జెట్ మొత్తంలో 2.66శాతం మాత్రమే వ్యవసాయ రం గానికి కేటాయించారు. వ్యవసాయ రుణాల మాఫీ, పీఎం కిసాన్ నగదు పెంపు, డీజిల్‌పై 50శాతం సబ్సిడీ, స్వామినాథన్ కమిటీ సిఫార్సుల మేరకు మద్దతు ధరలు, విద్యుత్ చట్ట సవరణ రద్దు, పోలవరం ప్రాజెక్టు నిధులు వంటి రైతుల డిమాండ్లపై ఎలాంటి స్పందన లేదు. బియ్యం ధరల నియంత్రణకు చర్యలు తీసుకుంటామని చెప్పడం వల్ల ధాన్యం ధరలు మళ్లీ తగ్గే అవకాశం ఉంది. రైతులకు మొండి చెయ్యి చూపారు

- కోటిరెడ్డి, ఏపీ రైతు సంఘాల సమాఖ్య అధ్యక్షుడు

బకాయిలు చెల్లించకుంటే బుద్ధిచెబుతాం

• యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు

నెల్లూరు (విద్య), ఫిబ్రవరి 1: ఉపాధ్యాయులకు సంబంధించిన ఆర్థిక బకాయిలు చెల్లించకుంటే వైసీపీ ప్రభుత్వానికి తగిన రీతిలో బుద్ధి చెబుతామని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ వెంకటేశ్వర్లు హెచ్చరించారు. కలెక్టరేట్ ఎదుట యూటీఎఫ్ చేపట్టిన రిలే నిరా హార దీక్షలో రెండవ రోజు గురు వారం ఆయన పాల్గొని మాట్లాడారు. ఆర్థిక బకాయిల సాధన కోసం రెండు నెలలుగా వివిధ రూపా ల్లో పోరాటాలు చేపట్టి చివరకు నిరాహార దీక్ష చేస్తున్నామని చెప్పారు. ఉద్యోగులు దాచు కున్న నగదును తిరిగి ఇవ్వకుండా దుర్మార్గంగా వ్యవహరిస్తున్న ప్రభుత్వానికి అంతిమ ఘడియలు ఆసన్నమయ్యాయన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షప్రధాన కార్యద ర్శులు వీవీ శేషులు, జీవీ చలపతిశర్మ, ఉపాధ్య క్షులు ఎంసీ అచ్చయ్య, కోశాధికారి ఏ మురళీధర్ రావు, కార్యదర్శులు మధుసూదన్‌రావు, సురేంద్ర బాబు, దయాకర్, మాజీ కార్యదర్శి కే పరంధామ య్య, పెన్షనర్స్ సంఘం జిల్లా నేత ఎం మస్తానయ్య పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న యూటీఎఫ్ నాయకులు

ధైర్యంగా ఉండండి..

మృతుల కుటుంబాలకు భువనేశ్వరి భరోసా

కార్యకర్తలే టీడీపీకి బలం, వారిని కాపాడుకుంటాం

మేమున్నాం!

'కార్యకర్తలే పార్టీకి బలం.. వారిని కంటికి రెప్పలా కాపాడుకోవడమే మా కర్తవ్యం.. మన నాయకుడు చంద్రబాబు నాయుడు కోసం ప్రాణాలు వదిలిన కుటుంబాలకు ధైర్యం చెప్పేందుకే వచ్చాను. ఆయా కుంటుంబాలకు అండగా ఉంటాము. అన్ని విధాలుగా వారిని ఆదుకుంటాము. మృతుల కుటుంబంలోని పిల్లల చదవులకు అవసరమైన అన్ని సహాయ, సహకారాలు అందిస్తాము. ధైర్యంగా ఉండండి.. పార్టీ ఎప్పుడూ మీతోనే ఉంటుంది.' అంటూ నారా భువనేశ్వరి బాధిత కుటుంబాలకు భరోసా ఇచ్చారు.



నెల్లూరు (విద్య/వైద్యం), ఫిబ్రవరి 1: టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టును తట్టుకోలేక మరణించిన బాధిత కుటుంబాలను ఆయన సతీమణి నారా భువనేశ్వరి గురువారం పరామర్శించారు. 'నిజం గెలవాలి' కార్యక్రమం పేరిట ప్రజల ముందుకు వెళుతున్న ఆమెకు పార్టీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు బ్రహ్మరథం పడుతున్నారు. రెండవ రోజు గురువారం మృతుల కుటుంబ సభ్యులను ఓదార్చి తామంతా ఉన్నామంటూ భరోసా ఇవ్వడంతోపాటు ఒక్కో కుటుంబానికి రూ.3లక్షల ఆర్థిక సాయం అందచేశారు. 'నిజం గెలవాలి' పేరిట జిల్లాలో పర్యటిస్తున్న భువనేశ్వరి గురువారం కందుకూరు, ఉదయగిరి, నెల్లూరు రూరల్, సిటీ నియోజకవర్గాల్లో పర్యటించారు. నగరంలోని వెంకటరెడ్డి నగర్‌కు చెందిన చంద్రబాబు వీరాభిమాని రేగల వెంకయ్య కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. అధైర్యపడవద్దని, ఏ అవసరం వచ్చినా పార్టీ పెద్దలని సంప్రదించాలని కోరారు. అలాగే ఇరుకళల పరమేశ్వరి ఆలయం వద్ద ఉన్న గిరిజన కాలనీలో పూల సుబ్బారావు కుటుంబాన్ని కూడా భువనేశ్వరి ఓదార్చారు. మృతుడి కుమారుడు శ్రీనివాసులు తమ గిరిజన కాలనీకి టీడీపీ ప్రభుత్వం రాజీవ్‌గృహాల వద్ద 3 ఎకరాలు కేటాయించిందని, అయితే వైసీపీ ప్రభుత్వం ఆ స్థలాన్ని ఎలాగైనా కైవసం చేసుకోవాలని చూస్తోందని ప్రస్తుతం హైకోర్టులో కేసు నడుస్తున్నట్లు తెలిపారు. దీనికి భువనేశ్వరి మాట్లాడుతూ ఈ విషయాన్ని చంద్రబాబు దృష్టికి తీసుకువెళతానని చెప్పారు. టీడీపీ అధికారంలోకి వస్తే వెంటనే సమస్యను పరిష్కరించనున్నట్లు తెలిపారు.

● ఘన స్వాగతం

నెల్లూరులో తెలుగుదేశం, జనసేన పార్టీల నాయకులతోపాటు మహిళలు తరలివచ్చి భువనేశ్వరి స్వాగతం పలికారు. అందరినీ చిరునవ్వుతో పలకరిస్తూ అభివాదం చేస్తూ అందరితో ఫొటోలు, సెల్ఫీలు తీసుకున్నారు. టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్, ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, ఎమ్మెల్సీ పంచుమర్తి అనూరాధ, మాజీ ఎమ్మెల్సీ బీదాటి రాధయ్య, కేంద్ర మాజీ మంత్రి పనబాక లక్ష్మీ, మాజీ మేయర్ భానుశ్రీ, నాయకులు మమతారెడ్డి, కనపర్తి గంగాధర్, సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, షాబీర్‌ఖాన్, గుద్దేటి చెంచయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఉప్పొంగిన అభిమానం

గుడ్లూరు/కొండాపురం: మండల కేంద్రమైన గుడ్లూరులో భువనేశ్వరిని చూసేందుకు ప్రజలు తరలివచ్చి ఘనస్వాగతం పలికారు. అనంతరం కర్సురపు సుబ్రహ్మణ్యం, పువ్వాడి చిన వెంకయ్య, దారకానిపాడు ఎస్సీకాలనీకి చెందిన దగ్గుమాటి వెంకటేశ్వర్లు కుటుంబాలను పరామర్శించారు. మృతుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఒక్కో కుటుంబానికి రూ.3 లక్షల చొప్పున ఆర్థిక సాయం చేశారు. పలుచోట్ల భువనేశ్వరి మాట్లాడుతూ కార్యకర్తలు, అభిమానులే టీడీపీకి బలమని, వీరిని కాపాడుకోవడమే కర్తవ్యంగా నారా చంద్రబాబు నాయుడు అహర్నిశలు శ్రమి స్తున్నారని అన్నారు. ఎన్నికల్లో పార్టీని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమాల్లో టీడీపీ ఒంగోలు పార్లమెంట్ అధ్యక్షుడు నూకసాని బాలాజీ, కందుకూరు ఇన్‌చార్జి ఇంటూరి నాగేశ్వరరావు, ఒంగోలు మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ నాయకులు బి. విజయ్‌కుమార్, దివి శివరాం తదితరులు పాల్గొన్నారు. అనంతరం కొండాపురం మండలం కొమ్మి గ్రామంలోని తాటిపర్తి సుధాకర్ కుటుంబాన్ని భువనేశ్వరి పరామర్శించారు. అంతకముందు ఉదయగిరి టీడీపీ ఇన్‌చార్జి బొల్లినేని వెంకట రామారావు, నెల్లూరు పార్లమెంటు అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్, ఎమ్మెల్సీ పంచుమర్తి అనూరాధ, ఉదయగిరి ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖరరెడ్డి, కేంద్ర మాజీ మంత్రి పనబాక లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గుడ్లూరులో తనను చూసేందుకు వచ్చిన అభిమానులకు అభివాదం చేస్తున్న భువనేశ్వరి



నెల్లూరులో వెంకయ్య కుటుంబాన్ని పరామర్శిస్తున్న భువనేశ్వరి, చిత్రంలో పార్టీ నేతలు సోమిరెడ్డి, అజీజ్, శ్రీధర్‌రెడ్డి తదితరులు



గుడ్లూరు : కమ్మపాలెంలో చిన్న వెంకయ్య కుటుంబంతో..



కొండాపురం : సుధాకర్ భార్య వెంగమ్మకు చెక్కు ఇస్తూ..



కందుకూరులో మహిళల నుంచి గులాబీ స్వీకరించి..



నెల్లూరు : భువనేశ్వరితో మాట్లాడుతున్న కోటంరెడ్డి

డీఎస్పీల బదిలీ

నెల్లూరు(క్రైం), ఫిబ్రవరి 1: రాష్ట్ర వ్యాప్తంగా పలువురు సివిల్, ఏఆర్ డీఎస్పీలను బదిలీ చేస్తూ రాష్ట్ర డీజీపీ కేవీ రాజేంద్రనాథ్ రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. అందులో భాగంగా జిల్లాలో పనిచేస్తున్న పలువురు డీఎస్పీలు బదిలీ అయ్యారు. అలాగే, డీఎస్పీ గా ఉద్యోగోన్నతి పొందిన పల వురు సీఐలు పోస్టింగ్ పొందారు.

పేరు	ప్రస్తుతం	బదిలీ
ఏ రామచంద్ర	కందుకూరు	ఎస్‌బీ, ప్రకాశం
ఏ శివాజీరాజా	సీఐడీ (అటాచ్‌డ్ సీసీఎస్ నెల్లూరు)	సీఐడీ
వై శ్రీనివాసరావు	సిఐడి(అటాచ్‌డ్ నెల్లూరు ఎస్సీఎస్టీ సెల్)	సిఐడి
సీ విజయభాస్కర్	డీఐజీ కార్యాలయం	నెల్లూరు రైల్వే
ఆయుధాల శ్రీనివాసరావు	సీసీఎస్ నంద్యాల	కందుకూరు
టీ సాయినాథ్	కర్నూల్ రేంజ్ (పదోన్నతి)	దిశ, నెల్లూరు
ఏఆర్ విభాగం		
జీ మహాత్మాగాంధీ	డీఏఆర్, నెల్లూరు	డీఏఆర్, పల్నాడు
ఎస్ చంద్రమోహన్	హోమ్‌గార్డ్స్, నెల్లూరు	డీఏఆర్, బాపట్ల
పీ వెంకటేశ్వరరావు	డీఏఆర్, ఒంగోలు	డీఏఆర్, నెల్లూరు

ఆర్ఎస్ఐలు..

గుంటూరు రేంజ్ పరిధిలోని పలువురు ఆర్ఎస్ఐలను బదిలీలు చేస్తూ ఐజీ పాలరాజు ఉత్తర్వులు జారీ చేశారు. గుంటూరు జిల్లా నుంచి జీ రాజారత్నం, వెంకటేశ్వరరావు, జీ వెంకటేశ్వర్లు, బీ సుధీర్‌కుమార్, పల్నాడు జిల్లా నుంచి పీ ఏసురాజు, ప్రకాశం జిల్లా నుంచి వై శివరామకృష్ణ ప్రసాద్, ఎం శ్యావ్య, ఎం సునీల్‌బాబు బదిలీపై జిల్లాకు వస్తున్నారు. జిల్లాలో పనిచేస్తున్న పీ నారాయణరెడ్డి, కే కృష్ణప్రసాద్, ఎం తిరుమలరెడ్డి, ఆర్ నాగరాజు గుంటూరు జిల్లాకు, పీ చంద్రమౌళి, ఎం హరికృష్ణ పల్నాడు జిల్లాకు, ఎన్ రాజశేఖర్, వీ సురేష్‌బాబు ప్రకాశం జిల్లాకు బదిలీ అయ్యారు.

ఎంపీడీవోలకు మండలాల కేటాయింపు

నెల్లూరు (జడ్పీ), ఫిబ్రవరి 1: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లాలోని ఎంపీడీవోలను బదిలీ చేసిన ప్రభుత్వం ఇతర జిల్లాల ఎంపీడీవోలను జిల్లాలో నియమించింది. చిత్తూరు, ప్రకాశం జిల్లాల నుంచి 31 మంది ఎంపీడీవోలు రావడంతో వారికి మండలాలు కేటాయిస్తూ జడ్పీ సీఈవో చిరం జీవి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.

1. రాపూరు	- సీ గంగయ్య
2. కోట	- ఎం శంకరయ్య
3. సైదాపురం	- జీ సుధాకర్
4. ఏఎస్ పేట	- కే వెంకటేశ్వర్లు
5. నాయుడుపేట	- ఏ ప్రేమ్ రాజ్‌కుమార్
6. ఇందుకూరుపేట	- వీఆర్ నాగరాజ
7. అనంతసాగరం	- షేక్ తాజ్ మాన్సూర్
8. తోటపల్లిగూడూరు	- కేఎన్ బాలాజీ
9. సంగం	- పీ శేషగిరి రావు
10. బాలయపల్లి	- వీ అరుణ
11. చిల్లకూరు	- వీ భానుమూర్తి రావు
12. కలువాయి	- వీఎంఆర్ ప్రభాకర్
13. పెళ్లకూరు	- కే సురేష్ బాబు
14. సూళ్లూరుపేట	- పీ చంద్రమౌళి
15. ఓజిలి	- కే శ్రీనివాసులు
16. పొదలకూరు	- ఎస్ఏ మొహ్మద్ రఫీ
17. చిట్టమూరు	- పీ సాయి లహరి
18. గూడూరు	- కే రామచంద్రా
19. దొరవారిసత్రం	- వో శివరాజు
20. వెంకటగిరి	- డీ నీలకంఠేశ్వర్ రెడ్డి
21. డక్కిలి	- సీ లీలా మాధవి
22. సీతారామపురం	- ఎస్ అబ్దుల్ కలామ్ ఆజాద్
23. మర్రిపాడు	- ఎస్ మనోహర్ రాజు
24. బోగోలు	- షేక్ జమీవుల్లా
25. కలిగిరి	- టీవీ కృష్ణకుమారి
26. బుచ్చిరెడ్డిపాళెం	- ఆర్ఎం రాజ్యలక్ష్మి
27. దగదర్తి	- డీ సురేష్ బాబు
28. కొడవలూరు	- వీ ప్రద్యుమ్న కుమార్
29. జలదంకి	- కే రాజశేఖర్‌రావు
30. కొండాపురం	- పీ సుజాత
31. కోవూరు	- బీ రామాంజనేయులు

సోమశిలలో 25.439 టీఎంసీల నీరు

అనంతసాగరం, ఫిబ్రవరి 1: సోమశిల పూర్తిసామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా గురువారం నాటికి జలాశయంలో 25.439 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. దిగువ డెల్టాకు 2,350, ఉత్తర కాలువకు 500, దక్షిణ కాలువకు 200 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

రూ.4 కోట్ల భూమిని భోంచేశారు!

• యథేచ్ఛగా ప్రభుత్వ భూమి ఆక్రమణ • ఆపై అక్రమంగా రిజిస్ట్రేషన్

• రెవెన్యూ సిబ్బందితో అక్రమార్కుల కుమ్మక్కు

7

వ్యాపారుల గుట్టు.. తనిఖీలతో రట్టు!

• ప్రయాణికుల ముసుగులో నగదు రవాణా

• పోలీసుల తనిఖీలలో వెలుగులోకి

• ఒక్కరోజే రూ.7కోట్లకుపైగా నగదు స్వాధీనం

• చెన్నై, తిరుపతిలలో బంగారం కొనుగోలుకే..

• విచారణలో వెలుగులోకి వచ్చిన వైనం

నెల్లూరు (క్రైం), ఫిబ్రవరి 1: ఎన్నికలు సమీపిస్తున్న వేళ జిల్లావ్యాప్తంగా పోలీసులు విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. పోలీసులు తనిఖీలతో బిల్లులు లేకుండా ప్రభుత్వాన్ని మోసం చేస్తూ పలువురు బంగారు వ్యాపారులు చేస్తున్న చట్ట వ్యతిరేక చర్యలు వరుసగా వెలుగులోకి వస్తున్నాయి. ఇటీవల రేల్వే పోలీసులు బిల్లులు లేకుండా రూ.కోటికి పైగా విలువ చేసే బంగారు ఆభరణాలు, నగదును స్వాధీనం చేసుకున్న విషయం తెలిసిందే. తాజాగా నెల్లూరు, వెంకటాచలం పోలీసులు గురువారం చేపట్టిన తనిఖీల్లో 15 మంది ప్రయాణికుల ముసుగులో రూ.7.23 కోట్లకు పైగా నగదును సీజ్ చేశారు. పట్టుబడిన వారంతా కాకినాడ, రాజమండ్రి, నరసారావుపేట వాసులుగా గుర్తించారు. ప్రయాణికుల ముసుగులో చెన్నై, తిరుపతి ప్రాంతాలకు బంగారం కొనుగోలు చేసేందు సరైన పత్రాలు లేకుండా నగదును తరలిస్తున్నారని పోలీసుల విచారణలో తేలింది. ఈ మేరకు నెల్లూరులోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాలులో నగర, రూరల్ డీఎస్పీలు శ్రీనివాసరెడ్డి, వీరాంజనేయ రెడ్డి స్వాధీనం చేసుకున్న నగదు పూర్వాపరాలను వివరించారు.

● ఎన్నికల సమీపిస్తున్న నెల్లూరులోని ఆత్మకూరు బస్టాండు వద్ద నవాబుపేట సీఐం ఎమ్ బాబి, ఎస్ఐ బి శివప్రకాష్‌లు తమ సిబ్బందితో తనిఖీలు చేస్తుండగా రాజమండ్రికి చెందిన లచ్చిరెడ్డి అప్పారావు, బి పవన్, సురా దుర్గాప్రసాద్, బొబ్బిల్లి శ్రీరామ్‌కృష్ణ, కాకినాడకు చెందిన తోట తాతరావు, తోట రమేష్, తోట సత్యవేణి, పుప్పల మణికంఠలను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద బ్యాగులను పరిశీలించగా రూ.4,38,50,000 నగదును గుర్తించారు. వారి వద్ద ఎలాంటి బిల్లులు లేకపోవడంతో నగదును స్వాధీనం చేసుకున్నారు. అలాగే నవాబుపేట పోలీసులు రైల్వేస్టేషన్ తూర్పు వైపు మెయిన్ గేటు వద్ద పోలీసులు తనిఖీ చేస్తుండగా రాజమండ్రికి చెందిన కె వికాస్, బి నరసింహం, వి సత్యనారాయణ, పి అరవింద్‌లను అదుపులోకి తీసుకుని, బిల్లులు లేని రూ.1,44,50,000 నగదును స్వాధీనం చేసుకున్నారు.

● వెంకటాచలం టోల్‌ప్లాజా వద్ద

వెంకటాచలం సీఐ బి అంకమరావు తమ సిబ్బందితో వెంకటాచలం టోల్‌ప్లాజా వద్ద ఏర్పాటు చేసిన ఇంటిగ్రేటెడ్ చెక్‌పోస్టు వద్ద విజయవాడ నుంచి పుదుచ్చేరి వెళుతున్న శ్రీకృష్ణ ట్రావెల్స్ బస్సులో తనిఖీలు చేశారు. ఈ తనిఖీల్లో పల్నాడు జిల్లకు చెందిన దూదేకుల జిలాని, షేక్ దావూద్, షేక్ అర్షద్‌ల నుంచి రూ.1,40,50,000 నగదును స్వాధీనం చేసుకున్నారు. నగదుకు సంబంధించిన రశీదులు చూపలేక పోవడంతో పెద్ద మనుషుల సమక్షంలో పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న రూ.7.23 కోట్ల నగదు

● బంగారు కొనుగోలు చేసేందుకు

ప్రభుత్వం కళ్లుగప్పి అక్రమ మార్గాలలో బంగారం కొనుగోలు చేసేందుకు ప్రయాణికుల ముసుగులో అధిక మొత్తంలో నగదును తరలిస్తున్నట్లు పోలీసుల విచారణలో తేలింది. కాకినాడ, రాజమండ్రి, పల్నాడు జిల్లాలు, విజయవాడ ప్రాంతాలకు చెందిన పలువురు వ్యాపారులు చట్ట వ్యతిరేక మార్గాలలో ఎలాంటి బిల్లులు లేకుండా చెన్నై, తిరుపతి ప్రాంతాల నుంచి బంగారు కొనుగోలు చేసి వాటిని అక్రమంగా తరలించి వ్యాపారం చేస్తున్నట్లు నిర్ధారించారు. తదుపరి విచారణ నిమిత్తం ఆదాయపన్ను అధికారులకు నగదును అప్పగించామని డీఎస్పీలు తెలిపారు. భారీగా నగదును సీజ్ చేసిన సిబ్బందిని వారు అభినందించారు. ఈ సమావేశంలో నవాబుపేట, వెంకటాచలం ఇన్‌స్పెక్టర్లు ఎం బాబి, బి అంకమ్మ, నవాబుపేట ఎస్ఐ శివప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

కామాక్షితాయి సేవలో భువనేశ్వరి


బుచ్చిరెడ్డిపాళెం : కామాక్షితాయి చిత్రపటం అందిస్తున్న ఆలయ చైర్మన్ తదితరులు

బుచ్చిరెడ్డిపాళెం : జొన్నవాడలోని కామాక్షితాయి అమ్మవారిని గురువారం సాయంత్రం నారా భువనేశ్వరి దర్శించుకున్నారు. అంతకుముందు సర్పంచు పెంచలయ్య, మాజీ ఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డితోపాటు తరలివచ్చిన పార్టీ నాయకులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో చైర్మన్ పుట్టా సుబ్రహ్మణ్యం నాయుడు దంపతులు, ఈఓ గిరికృష్ణ, అర్చకులు గోత్రనామాలతో స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేయించి, ప్రసాదం అందజేశారు. కేంద్ర మాజీ మంత్రి పనబాక లక్ష్మి, తాళ్లపాక అనురాధ, శేషయ్య, హరికృష్ణ, రామానాయుడు, హరనాథ్, కొండయ్య, ఉమ్మయ్యస్వామి, తాళ్ళస్వామి, సుబ్బారావు, ప్రభాకర్, ఎస్.వెంకటేశ్వర్లు, నందకుమార్, బుచ్చి మాజీ సర్పంచు స్నేహలత, కౌన్సిలర్ కల్యాణ్, గోపి, శంకర్, ఎన్.ప్రసాద్, అంకయ్య, పురుషోత్తం, మైనారిటీ, దళిత నాయకులు పాల్గొన్నారు.

చంద్రబాబుని ముఖ్యమంత్రిని చేయాలి : కురుగొండ్ల


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రామకృష్ణ

సైదాపురం, ఫిబ్రవరి 1: రానున్న ఎన్నికల్లో వైసీపీని భూస్థాపితం చేసి టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడిని ముఖ్యమంత్రిని చేయాలని టీడీపీ మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. గురువారం సాయంత్రం మండల కేంద్రంలో జయహో బీసీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల మాట్లాడుతూ సీఎం జగన్ బీసీలను మోసం చేశాడని, టీడీపీ ప్రభుత్వం బీసీలకు ప్రాధాన్యత ఇచ్చిందని, బీసీలే టీడీపీకి బలం అన్నారు. ఈసందర్భంగా, తూర్పుపూండ్ల గ్రామానికి చెందిన వైసీపీ మాజీ సర్పంచ్ పచ్చా సిద్దమనాయుడికి టీడీపీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వా నించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి గంగోడు నాగేశ్వరరావు, వెంకటగిరి నియోజకవర్గం నాయకుడు బొలిగర్ల మస్తాన్ యాదవ్, తిరుపతి జిల్లా టీడీపీ బీసీ అధ్యక్షుడు రుద్రకోట సదాశివం, మండల నాయకులు కొండూరు సుబ్రహ్మణ్యం రాజు, నలమారు వెంకటేశ్వర్లు రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాధనానికి తుప్పు

- పట్టించుకోని అధికారులు


తహసీల్దారు కార్యాలయం వద్ద వృథాగా జనరేటర్


పంచాయతీ కార్యాలయంలో నిరుపయోగంగా రిక్షాలు, ఆటోలు

ఉదయగిరి రూరల్, ఫిబ్రవరి 1: అధికారుల నిర్లక్ష్యంతో విలువైన ప్రజాధనం వృథా అవుతోంది. రూ.లక్షలు వెచ్చించి కొనుగోలు చేసిన జనరేటర్లు, ఆటోలు, రిక్షాలు, ప్రభుత్వ వాహ నాలు మూలకు చేరాయి. జనరేటర్లు, కొన్ని వాహనాలు చిన్నపాటి మరమ్మత్తులు చేసి వాడుకలోకి తీసుకురావచ్చు. అయినా అధికారులు పట్టించుకోవడంలేదనే విమర్శలు వినిపిస్తున్నా యి. తుప్పు పడుతున్న వాహనాలు: గత ప్రభుత్వ హయాంలో పంచాయతీల్లో చెత్తను తరలించేందుకు బ్యాటరీతో నడిచే ఆటోలను కొనుగోలు చేశారు. తడి, పొడి చెత్తను విడివిడిగా సేకరించి తరలించే ఈ వాహనాలను ఒక్కొక్కటి. రూ.1.75 లక్షలు వెచ్చించి కొనుగోలు చేశారు. అలాగే చెత్తను తరలించే రిక్షాలను సైతం పంపిణీ చేసింది. వాటిల్లో కొన్ని మరమ్మతులకు గురికావడంతో పంచాయతీ కార్యాలయంలో వృథాగా పడి ఉన్నాయి. ఆటోలు, రిక్షాలు, ఇతరత్రా వాహనాలు తుప్పు పట్టి ఎందుకూ పనికిరాకుండా పాడైపోతున్నాయి. అలాగే తహ సీల్దారు కార్యాలయాల్లో విద్యుత్ లేని సమయంలో వినియోగించుకొనేందుకు అనుకూలంగా 2011లో రాష్ట్ర వ్యాప్తంగా జనరేటర్లు కొనుగోలు చేశారు. ఏర్పాటుచేసిన కొన్ని నెలలపాటు అవి పనిచేశాయి. అనంతరం చిన్నపాటి మరమ్మతులకు గురయ్యాయి. బాగు చేసి వినియోగంలోకి తీసుకురావాల్సిన అధికారులు పట్టించుకోకపోవడంతో అవి మూలకు చేరాయి. అలాగే పోలీ స్స్టేషన్, అటవీ శాఖా కార్యాలయంలో కేసులు నమోదై, ప్రమాదాలకు గురైన వాహనాలు కూ డా దుమ్ముధూళితో నిండి వృథాగా పడిఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు వాటికి మరమ్మతు లు చేపట్టి వినియోగంలోకి తీసుకువచ్చేలా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి


రమణయ్య మృతదేహం

ఉదయగిరి రూరల్, ఫిబ్రవరి 1: విద్యుదాఘాతానికి గురై ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన మండలంలోని సున్నంవారిచింతల గ్రామంలోగురువారం చోటు చేసుకొంది. వివరాలిలా ఉన్నాయి. వెంకట్రావుపల్లి గ్రామానికి చెందిన గెట్టిబోయిన రమణయ్య (50) విద్యుతు మరమ్మతు పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుంటాడు. ఈనేపథ్యంలో సున్నంవారిచింతల గ్రామ వనంతోపులోని ఆలయాలకు విద్యుత్ సర ఫరా కావడంలేదని, మరమ్మతులు చేయాలని పలువురు స్థానికులు అతనికి సూచించారు. దీంతో రమణయ్య మరమ్మతు పనులు చేపట్టేందుకు ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఫ్యూజులు తొలగించి విద్యుత్ స్తంభాన్ని ఎక్కాడు. అయినప్పటికీ తీగల్లో విద్యుత్ సరఫరా కావడంతో రమణయ్య విద్యుదాఘాతానికి గురై కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. గ్రామస్థులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఏఎస్ఐ శ్రీనివాసులు తన సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. రమణయ్య మృతితో కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు. వెంకట్రావుపల్లిలో విషాద ఛాయలు అలుముకొన్నాయి.

చేపల కూర వండలేదని భర్త ఆత్మహత్య

నెల్లూరు(క్రైం), ఫిబ్రవరి 1: ఇంట్లో భార్య చేపల కూర వండలేదని భర్త ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల సమాచారం మేరకు... నెల్లూరులోని బుజబుజనెల్లూరు యాదవవీధిలో విజయలక్ష్మి, వెంకటేశ్వర్లు(48) దంపతులు నివసి స్తున్నారు. వారికి ఒక కుమారుడు వినయ్ ఉన్నాడు. వెంకటేశ్వర్లు కూలి పనులు, విజయలక్ష్మి పాల వ్యాపారంతో కుటుంబాన్ని పోషించు కుంటున్నారు. కొంతకాలంగా వెంకటేశ్వర్లు మద్యానికి బానిసై నిత్యం భార్యతో గొడవపడేవాడు. గత నెల 31వ తేదీ కూడా పూటుగా మద్యం సేవించి ఇంటికి వచ్చాడు. మధ్యాహ్నం భోజనంలోకి చేపలకూర వండలేదని భార్యతో గొడవపడ్డాడు. రైలుకింద పడి చనిపోతా నంటూ బయటకు వెళ్లబోయాడు. కుటుంబ సభ్యులు అడ్డుకుని ఇంట్లోని గదిలో పెట్టి తలుపు వేశారు. దీం తో కోపోద్రిక్తుడైన వెంకటేశ్వర్లు చీరతో ఉరి వేసుకున్నాడు. కాసేపటి తర్వాత గుర్తించిన భార్య, కుమారుడు హుటాహుటిన వెంకటేశ్వర్లును జీజీహెచ్‌కు తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. భార్య విజయలక్ష్మి ఫిర్యాదు మేరకు వేదాయపాళెం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	120
లేయర్ లైవ్	85
స్కిన్ చికెన్	216
స్కిన్‌లెస్	242
లేయర్	145

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ. 5993
వెండి కిలో ధర	రూ. 73,100
వెండి ఒక గ్రాము	రూ. 75.10

రూ.4 కోట్ల భూమిని భోంచేశారు.. !

- యథేచ్ఛగా ప్రభుత్వ భూమి ఆక్రమణ
- ఆపై అక్రమంగా రిజిస్ట్రేషన్
- రెవెన్యూ సిబ్బందితో అక్రమార్కుల కుమ్మక్కు
- పట్టించుకోని ఉన్నతాధికారులు

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), ఫిబ్రవరి 1: పేదోడు సెంటు భూమి ఆక్రమిస్తే రెవెన్యూ అధికారులు నానా యాగీ చేస్తారు. అయితే రెవెన్యూ సిబ్బంది, కొంతమంది వ్యక్తులు కుమ్మక్కై ఏకంగా 32 ఎకరాలకుపైగా ప్రభుత్వ భూమిని కాజేసి అక్రమ రిజిస్ట్రేషన్ చేశారు. గతంలోనూ ఈ భాగోతం జరిగినా ఉన్నతాధికారులు స్పందించడంతో కొన్ని మాసాలపాటు ఈ అక్రమానికి తెరపడింది. అయితే అక్రమార్కులు రూ.కోట్ల విలువ చేసే ఈ భూమిపై కన్నేయడంతో ఇటీవల రెవెన్యూ సిబ్బంది సహకారంతో ఇద్దరి పేర్లపై 32.51 ఎకరాల భూమిని 1బీ, అడంగల్‌లో నమోదు చేయడమే కాకుండా ఏకంగా రిజిస్ట్రేషన్ కూడా చేసేశారు.

● అక్రమార్కులతో అధికారుల కుమ్మక్కు

దుత్తలూరు రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబరు 448-1లో మొత్తం 141.16 ఎకరాల భూమి ఉంది. అది రికార్డుల్లో గర్భకండ్రికగా నమోదై ఉంది. ఈ భూమి క్రయవిక్రయాలు నిషేధం. కానీ దుత్తలూరుకు చెందిన కొంతమంది వ్యక్తుల కన్ను ఆ భూమిపై పడింది. ఎలాగైనా కాజేయాలని పన్నాగం పన్నారు. ఇంకేముంది అధికారులు, అక్రమార్కులు చేతులు కలిపారు. 2021లో తహ సీల్దారు, రెవెన్యూ సిబ్బంది తో చర్చలు జరిపారు. ఇంకేముంది అనుకున్నట్లుగానే షేక్ జమీరుద్దీన్ పేరు మీద 12.51 ఎకరాలు, దుత్తలూరుకు చెం దిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి షేక్ మహ్మద్ హుస్సేన్ పేరుపై 20 ఎకరాలు రెవెన్యూ రికార్డుల్లో వార సత్వం కింద నమోదు చేయించారు. దీనికితోడు ఆ భూమికి సంబంధించి పాసుపుస్తకాలను సైతం మంజూరు చేశారు. అనంతరం ఉదయగిరి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ కూడా చేయించారు.

● అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో...

ఈ అక్రమ భూదందా విషయమై అప్పట్లో ఎమ్మె ల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి తహసీల్దారు, సిబ్బందిపై తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేసి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. కావలి ఆర్డీవో శీనానాయక్ విచారణ చేపట్టి సిబ్బందిపై మండిపడ్డారు. వెంటనే తహసీల్దారు డిజిటల్ సైన్ నిలిపివేసి భూమిని రెడ్‌మా ర్కులో పెట్టారు. కొద్ది రోజులు గడిచాక అక్రమార్కులు అధికారులతో కుమ్మక్కై రెడ్‌మార్కును తొలగించారు. అనంతరం కడపజిల్లా ప్రొద్దుటూరుకి చెందిన అధికార పార్టీ నాయకులతో కలిసి రిజిస్ట్రేషన్ కార్యాలయంలో గతేడాది సెప్టెంబరులో 32.51 ఎకరాలను బినామీపేర్లతో అక్రమ రిజిస్ట్రేషన్ చేయించారు. ప్రస్తుతం ఈ భూమి విలువ బహిరంగ మార్కెట్‌లో రూ.4 కోట్లకుపైగానే ఉంది. ఈ వ్యవహారంలో దుత్తలూరు తహసీల్దారు కార్యాలయంలో పనిచేసే అధికారులు, సిబ్బంది హస్తం ఉన్నట్లు బహిరంగ విమర్శలు వినిపిస్తున్నాయి.


ప్రభుత్వ భూమిలో సాగు చేసిన జామాయిల్

● ఫిర్యాదు చేసినా ఫలితమేది ?

ఈ భూకుంభకోణంపై గతంలో గ్రామస్థులు అన్ని ఆధారాలతో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. అయినా ఫలితం లేదని వారు వాపోయారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్పందించి పూర్తిస్థాయిలో విచారణ జరిపి బాధ్యులపై చర్య లు చేపట్టాలని వారు కోరుతున్నారు.

ఉన్నతాధికారులకు నివేదిస్తాం..



సర్వే నెంబరు 448-1లో ఉన్నది గర్భకండ్రిక భూమి. క్రయవిక్రయాలు చేయరాదు. కానీ గతంలో పనిచేసిన అధికారులు, సిబ్బంది రికార్డుల్లో చేర్పులు, మార్పులు చేశారు. దీంతో రిజిస్ట్రేషన్‌లు జరిగాయి. ఈ భూ వ్యవహారంపై ఉన్నతాధికారులకు నివేదిక పంపుతా.

- రామ్మోహన్‌రావు, తహసీల్దారు, దుత్తలూరు

ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించాలి

- డీఎంహెచ్‌వో డాక్టర్ పెంచలయ్య


మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో పెంచలయ్య

నెల్లూరు (వైద్యం), ఫిబ్రవరి 1 : ప్రభుత్వ వైద్యాధికారులు వారి బాధ్యతలను సక్రమంగా నిర్వహిం చాలని, ప్రజలకు నాణ్యమైన వైద్యాన్ని అందించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ పెంచలయ్య ఆదేశించారు. గురువారం డీఎం హెచ్‌వో కార్యాలయంలో స్పెషలిస్ట్ వైద్యులు, పట్టణ ఆరోగ్య కేంద్రాల అధికారులతో ఆయన సమీక్షించారు. వైద్యులు ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. నూతన ఆరోగ్యశ్రీ కార్డులను త్వరగా పంపిణీ చేయాలని, ఆరోగ్యశ్రీ గురించి ఏఎన్ఎంలు ప్రజలకు వివరించాలని సూచించారు. కాటరాక్ట్ శస్త్రచికిత్సలకు సంబంధించి బాధితులను ఆసుపత్రులకు సిఫార్సు చేయాలన్నారు. ఈ నెల 9వ తేదీన జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమం ఉందని, 1 నుంచి 19 ఏళ్లలోపు వారితో ఆల్‌బెండజోల్ మాత్రలు మింగించాలన్నారు. డీపీఎంవో డాక్టర్ రమేష్ మాట్లాడుతూ హెచ్‌డీఎస్ నిధులను సద్వినియోగం చేసుకోవాలని, బయోమెట్రిక్ అటెండెన్స్ తప్పని సరిగా వేయాలని సూచించారు. ఈ సమావేశంలో డెమో శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కుష్ఠువ్యాధిపై అవగాహన ఉండాలి : ఏడీఎంహెచ్‌వో

ప్రతి ఒక్కరు కుష్ఠువ్యాధిపై అవగాహన కలిగి ఉండాలని అడిషనల్ డీఎంహెచ్‌వో డాక్టర్ ఖాదర్‌వలి సూచించారు. గురువారం నెల్లూరులోని 14వ డివిజన్‌లో స్పర్శ పేరుతో కుష్ఠువ్యాధిపై అవగాహన సదస్సు జరిగింది. శరీరంలో ఎక్కడైనా స్పర్శ లేకపోతే వెంటనే వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కర్తం ప్రతాపరెడ్డి, వైద్యాధికారి డాక్టర్ సమీరా, రమణారెడ్డి, విజయలక్ష్మి పాల్గొన్నారు.

విజయభేరి సభను విజయవంతం చేయండి


చేనేత కులాల విజయభేరి సభను విషయవంతం చేయాలని పిలుపునిస్తున్న నేతలు

సంగం, ఫిబ్రవరి 1: చేనేత ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వ ర్యంలో ఈనెల 4వ తేదీన నెల్లూరులో జరిగే చేనేత కులాల విజయభేరి సభ ను విజయవం తం చేయాలని చేనేత ఐక్య కార్యాచరణ కమిటీ నాయకులు పిలుపునిచ్చారు. గురువారం మండల కేంద్రమైన సంగం కొత్తూరులోని బాలచౌడేశ్వరి ఆలయంలో చేనేత కార్మికులతో చేనేత ఐక్య కార్యాచరణ కమిటీ నాయకులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చేనేత కులాలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వాలు, రాజకీయ పార్టీల దృష్టికి తీసుకెళ్లేందుకు ఈ వేదిక ఉపయోగపడుతుందన్నారు. సమావేశానికి ముఖ్య అతిథులుగా కర్నూలు ఎంపీ సంజీవ్‌కుమార్, మాజీ చేనేత మంత్రి నిమ్మల కిష్టప్ప వస్తున్నట్లు తెలిపారు. చేనేతలందరూ తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో చేనేత ఐక్య కార్యాచరణ కమిటీ నాయకులు బుధవరపు బాలాజీ, ఆశం సురేష్, గోపాల్, మల్లికార్జున, స్థానిక చేనేత నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

దోమల నివారణకు చర్యలేవి..?


నిరుపయోగంగా పడి ఉన్న పరికరాలు

వరికుంటపాడు, ఫిబ్రవరి 1: ప్రస్తుత వాతా వరణ మార్పుల దృష్ట్యా రాత్రి, పగలు తేడా లేకుండా దోమలు విజృంభిస్తున్న ప్పటికీ పట్టించుకునే నాథు డే కరువయ్యాడనే విమ ర్శలు వెల్లువెత్తుతున్నాయి. అందుకు నిదర్శనంగా స్థానిక ఉపాధిహామీ పథ కం కార్యాలయంలో దోమల నివారణ పరికరాలు నిరుప యోగంగా దర్శనమి స్తున్నాయి. ఏళ్ల తరబడి ఎంతో విలువైన ఆ పరికరాలను కనీసం అట్టపెట్టెల్లో నుంచి బయటకు తీయనేలేదంటే అధికారుల పనితీరు తేటతెల్లమవుతోంది. దోమల తాకిడితో ఒకవైపు రోగాల బారిన పడుతూ, మరోవైపు జాగారం చేయాల్సి వస్తోందని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఆ పరికరాలను వినియోగంలోకి తీసుకొచ్చి పల్లెల్లో దోమల నివారణకు చర్యలు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.

రొచ్చు తొక్కాల్సిందే..



వరికుంటపాడు : తూర్పురొంపిదొడ్ల ఉన్నత పాఠశాలకు వెళ్లాలంటే ప్రతినిత్యం విద్యార్థులు రొచ్చు తొక్కాల్సిందే. రహదారికి ఆనుకొని ఉన్న ఆ పాఠశాలలోని వృధా నీరు ప్రధాన గేటుకు ఎదుట రహదారిపై నిల్వ ఉంటుండడంతో దోమలకు నిలయాలుగా మారుతుంది. దీంతో పాఠశాలకు వెళ్లే ఉపాధ్యాయులతో పాటు విద్యార్థులు బురద నీటిని తొక్కకుండా లోనికి వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. రోజుల తరబడి రహదారి వెంట నిలిచిన మురుగు నీటి పుణ్యమాని అటుగా వెళ్లే ప్రజలు, వాహనదారులు సైతం విసుగెత్తిపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు దృష్టి సారించి పాఠశాల ఎదుట మురుగునీరు నిల్వ లేకుండా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

దోచుకోవడమే మంత్రి కాకాణి పని : సోమిరెడ్డి


మహిళకు కరపత్రం ఇస్తున్న సోమిరెడ్డి

ముత్తుకూరు, ఫిబ్రవరి 1: దోచుకోవడమే మంత్రి కాకాణి గోవర్ధనరెడ్డి పని అని టీడీపీ జాతీయ పొలి ట్‌బ్యూరో సభ్యుడు సోమి రెడ్డి చంద్రమోహన్ రెడ్డి మండిపడ్డారు. నేలటూరు దళితవాడలో గురువారం నిర్వహించిన బాబు షూరి టీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేలటూరు పంచాయతీని తరలించేందుకు టీడీపీ ప్రభుత్వ హయాంలో స్థలాలు ఎంపిక చేసి, నిర్మాణాలు ప్రారంభించామన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చి ఐదేళ్లు అవుతున్నా పునరావాసం పూర్తిచేయలేదని, కాకాణికి ప్రజల బాగోగులు పట్టవా అని ప్రశ్నించారు. అనంతరం ఇంటింటికీ తిరిగి కరపత్రాలు పంచి, ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు తెలిపారు. రాష్ట్ర భవిష్యత్తు చంద్రబాబుకే సాధ్యమని వివరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర నాయకులు బొమ్మి సురేంద్ర, మండల టీడీపీ అధ్యక్షుడు పల్లంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి, సన్నారెడ్డి సురేష్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి నీలం మల్లికార్జున్‌యాదవ్, అధ్యక్షుడు ఈపూరు మునిరెడ్డి, నాయకులు పెడకాల మోహన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ కోటేశ్వరరావుకు ఉత్తమ అవార్డు


మంత్రి నుంచి అవార్డు, ప్రశంసా పత్రం అందుకుంటున్న డాక్టర్ కోటేశ్వరరావు

నెల్లూరు(వ్యవసాయం): విధుల్లో ఉత్తమ పనితీరు కనబర్చిన నెల్లూరు వెటర్నరీ పాలీక్లినిక్ డీడీ డాక్టర్ వీ కోటేశ్వరరావు గురువారం రాష్ట్ర ప్రభుత్వ అవార్డు అందుకున్నారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా అందజేసే అవార్డులను విజయవాడలోని పశుసంవర్ధకశాఖ డైరెక్టర్ కార్యాలయంలో గురువారం ఆ శాఖ మంత్రి సీదిరి అప్పలరాజు నుంచి అందుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆ శాఖ రాష్ట్ర సంచాలకుడు డాక్టర్ ఆర్ అమరేంద్రకుమార్ పాల్గొన్నారు.

జాతీయస్థాయి కుస్తీ పోటీలకు మనుబోలు యువకుడి ఎంపిక

- ఆర్థిక సాయం కోసం ఎదురుచూపు


ముఖేష్‌ను అభినందిస్తున్న కోచ్ ప్రేమ్

మనుబోలు, ఫిబ్రవరి 1: జాతీయ స్థాయి కుస్తీ పోటీలకు మనుబోలు సంజీవయ్య కాలనీకి చెందిన కరింబేటి ముఖేష్ ఎంపికయ్యాడు. ఐటీఐ చదివిన ముఖేష్ కోచ్ ప్రేమ్ దగ్గర శిక్షణ పొందాడు. ఇటీవల టంగుటూరు జిల్లా జమ్ములపల్లిలో జరిగిన రాష్ట్రస్థాయి కుస్తీ పోటీలలో పాల్గొ ని ప్రతిభ చూపడంతో జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక య్యాడు. ఫిబ్రవరి 9నుంచి 15వరకు మధ్యప్రదేశ్‌లో జరగ నున్న జాతీయ పోటీలకు ముఖేష్ వెళ్లాల్సి ఉంది. అయితే అక్కడకు వెళ్ళేందుకు తనకు స్థోమత లేదని, ఎవరైనా ఆర్థిక సాయం చేసి ఆదుకోవాలని ముఖేష్ కోరుతున్నాడు.

4న బ్యాడ్మింటన్ మాస్టర్స్ జిల్లా జట్ల ఎంపిక

నెల్లూరు (విద్య), ఫిబ్రవరి 1 : జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 4వతేదీన మాస్టర్స్ జిల్లా స్థాయి పోటీలు, ఎంపికలు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నిమ్మల వీర వెంకటేశ్వర్లు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ పోటీలు నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో జరుగుతాయని తెలిపారు. 35 నుంచి 75 ఏళ్ల పైన వరకు అన్ని విభాగాల్లో పురుషులు, మహిళలకు పోటీలు నిర్వ హిస్తామన్నారు. విజేతలు రాజమండ్రి లో ఈనెల 16 నుంచి జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. పోటీలు, ఎంపికలకు సంబంధించిన మరిన్ని వివరాలకు 9866930555 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

నిబంధనలకు విరుద్ధంగా బొగ్గుబట్టీల ఏర్పాటు

- పట్టించుకోని అధికారులు

అనంతసాగరం, ఫిబ్రవరి 1: మండలంలోని పలు గ్రామాల్లో విచ్చలవిడిగా బొగ్గు బట్టీలు నిర్వహిస్తూ ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్నా అటవీ శాఖ అధికారులు పట్టించు కోవడం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. బర్నింగ్ అనుమతులు లేకుండా నిబంధనలకు విరుద్ధంగా కొన్నిచోట్ల బట్టీలు ఏర్పాటు చేశారన్న ఆరోపణలు ఉన్నాయి. అనంతసాగరంలో గతంలో ప్రభుత్వ ఆసుపత్రి పక్కన బట్టీలను ఏర్పాటుచేయగా రోగులకు ఇబ్బందికరం అనే విషయాన్ని పరిగణలోకి తీసుకొని అనుమతి రద్దుచేసినప్పటికీ మరలా అదేప్రాంతంలో బొగ్గు కాల్చుతున్నారు. రేవూరు, ఇస్కపల్లి గ్రామాల మధ్య ఆత్మకూరు రోడ్డుపక్కనే బొగ్గు తయారీ కేంద్రం వెలిసింది. కొత్తపల్లితో పాటు వివిధ గ్రామాల్లో బొగ్గుకాల్చుతూ లారీల ద్వారా సరుకును ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న బొగ్గు బట్టీలపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.


లారీలో నింపిన బొగ్గు బస్తాలు

చంద్రబాబునాయుడుతోనే రాష్ట్ర భవిష్యత్తు : బొల్లినేని



టీడీపీలో చేరిన వారితో బొల్లినేని, చెంచలబాబు, మన్నేటి

ఉదయగిరి రూరల్, ఫిబ్రవరి 1: మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుతోనే రాష్ట్ర భవిష్యత్తుకు గ్యారంటీ ఉంటుందని మాజీ ఎమ్మెల్యే బొల్లినేని వెంకటరామారావు పేర్కొన్నారు. గురువారం మండలంలోని జీ.చెరువుపల్లి గ్రామంలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా ప్రజాదీవెన యాత్ర చేపట్టి ఇంటింటా మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాజీ ఏఎంసీ చైర్మన్ మన్నేటి వెంకటరెడ్డి ఆధ్వర్యంలో గ్రామంలోని బడబాగ్ని చినరామరాజు, ఓంకారం వెంకటరామారాజు, తంబులూరి వెంకటేష్, మంచాల శ్రీనివాసులు, కోసినిపోగు రాజు, మంచాల వెంకటయ్య, శ్రీనివాసులు, నాగాంజనేయులు, వెంకటయ్య తదితర 40 కుటుంబాలు పార్టీలో చేరారు. వారికి బొల్లినేని పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. జగన్ రాక్షస పాలన నుంచి రాష్ట్రానికి విముక్తి కావాలన్నారు. ప్రతిఒక్కరూ ఒక సైనికుడిలా పనిచేసి జరగనున్న ఎన్నికల్లో చంద్రబాబును ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పొన్నెబోయిన చెంచలబాబుయాదవ్, నియోజకవర్గ పరిశీలకుడు వికాస్‌హరికృష్ణ, మండల టీడీపీ కన్వీనర్ బయ్యన్న, టీడీపీ నాయకులు బొజ్జా నరసింహాలు, నల్లిపోగు రాజా, ఓబులరెడ్డి, గూడూరు వెంకటేశ్వరరావు, కప్పా శ్రీనివాసులు, బాబు, అర్షద్, అంకయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు జయహో బీసీ సమావేశం

స్థానిక చెంచలబాబు అతిథిగృహంలో శుక్రవారం ఉదయగిరి, వరికుంటపాడు మండలాల జయహో బీసీ సమావేశం నిర్వహిస్తున్నట్లు మండల టీడీపీ కన్వీనర్ చింతనబోయిన బయ్యన్న గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే బొల్లినేని వెంకటరామారావు, మాజీ జడ్పీ చైర్మన్ చెంచలబాబుయాదవ్, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు కె.శ్రీనివాసులు, నియోజకవర్గ పరిశీలకులు వికాస్‌హరికృష్ణలు పాల్గొంటారన్నారు. కావున ఆయా మండలాల్లోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధికసంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.

అంగన్‌వాడీలకు నియామక పత్రాల అందజేత



నియామకపత్రాలు అందజేస్తున్న సీడీపీవో లావణ్య

ఉదయగిరి, ఫిబ్రవరి 1: ఉదయగిరి ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని సీతారామపురం, ఉదయగిరి మండలాల్లో ఎంపికైన అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలకు గురువారం సీడీపీవో పచ్చవ లావణ్య నియామక పత్రాలు అందజేశారు. గుడినరవ, గండంవారిపల్లి కేంద్రాలకు కార్యకర్తలు, ఉదయగిరి, చెర్లోపల్లి, బసినేనిపల్లి ఆయా పోస్టులకు నియామక పత్రాలు అందజేశారు.

పాఠశాలల తనిఖీ

ఉదయగిరి రూరల్, ఫిబ్రవరి 1: విద్యార్థులకు అర్థమయ్యేలా ఉపాధ్యాయులు బోధన చేయాలని ఎంఈవోలు మస్తాన్‌వలి, శ్రీనివాసులు పేర్కొన్నారు. గురువారం వారు మండలంలోని సున్నంవారిచింతల, తిరుమలాపురం, పుల్లాయపల్లి పాఠశాలలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సంబంధిత రిజిస్టర్లతోపాటు మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్ట్రాంగ్‌రూమ్ పరిశీలన

ఉదయగిరి, ఫిబ్రవరి 1: పట్టణంలోని ఇంటిగ్రేటెడ్ వసతిగృహంలో స్ట్రాంగ్‌రూమ్‌ను గురువారం ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాజారమేష్‌ప్రేమ్‌కుమార్ పరిశీలించారు. ఎన్నికల దృష్ట్యా నియోజకవర్గంలోని ఎనిమిది మండలాల తహసీల్దారులను గుంటూరు, పల్నాడు తదితర ప్రాంతాలకు బదిలీ చేయడం జరిగిందన్నారు. నియోజకవర్గంలో 1,18,467 పురుషులు, 1,20,091 మహిళలు, 13 థర్డ్‌జెండర్ ఓట్లు ఉన్నాయని తెలిపారు.

మర్రిపాడు ఎంపీడీవోగా మనోహర్‌రావు బాధ్యతల స్వీకరణ

మర్రిపాడు, ఫిబ్రవరి 1: నూతన ఎంపీడీవోగా ఎస్ మనోహర్‌రావు గురువారం బాధ్యతలు చేపట్టారు. అన్నమయ్య జిల్లా కలెక్టరు కార్యాలయంలో ఏవోగా పనిచేస్తూ ఎన్నికల బదిలీల్లో భాగంగా ఆయన మర్రి పాడుకు వచ్చినట్లు తెలిపారు. మండల ప్రజలు, నేతలు తనకు సహకరించాలని కోరారు.

తహసీల్దారుకు సన్మానం



తహసీల్దారు నాగరాజును సన్మానిస్తున్న సిబ్బంది

సంగం, ఫిబ్రవరి 1: స్థానిక తహసీల్దారు వై నాగరాజు ఎన్నికల బదిలీల్లో భాగంగా బాపట్ల జిల్లాకు బదిలీ అయ్యారు. దీంతో ఆయనను కార్యాలయ సిబ్బంది గురువారం ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. తనకు సహకరించిన సిబ్బందికి తహసీల్దారు నాగరాజు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీటీలు ప్రవీణ్ కుమార్, అశోక్ కుమార్, కార్యాలయ సిబ్బంది, వీఆర్వోలు పాల్గొన్నారు.

ప్రైవేట్ లేఅవుట్ పరిశీలన



సంగంలోని ప్రైవేట్ లేఅవుట్‌ను పరిశీలిస్తున్న ట్రైనీ కలెక్టర్ సంజనా సిన్హా

సంగం, ఫిబ్రవరి 1: సంగంలోని ఓ ప్రైవేట్ లేఅవుట్‌ను ట్రైనీ కలెక్టర్ సంజనాసిన్హా గురువారం పరిశీలించారు. సంగం ఎర్రచెరువు సమీపంలో ముంబయి రహదారి పక్కన 273 సర్వే నెంబరులో ప్రైవేట్ లేఅవుట్ వేస్తున్నారు. ఈ లేఅవుట్‌లో ప్రభుత్వ భూమి ఉందని జిల్లా రైతు సంక్షేమ సంఘం అధ్యక్షుడు పిట్టు రేణుకారెడ్డి కలెక్టర్‌కు స్పందన కార్యక్రమంలో ఫిర్యాదు చేశారు. దీంతో కలెక్టర్ ఆదేశాల మేరకు ట్రైనీ కలెక్టర్ లేఅవుట్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె రెవెన్యూ రికార్డులను తనిఖీ చేశారు. లేఅవుట్ వద్ద వేసిన ఆర్సీ రోడ్డు పోరంబోకు స్థలంలో ఉందని రెవెన్యూ అధికారులే చెప్పడంతో తొలగించమని నిర్వాహకులను ఆదేశించారు. అనంతరం లేఅవుట్‌పై సాయంత్రానికి నివేదిక పంపమని తహసీల్దారు నాగరాజును ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సర్వేయర్ శాంత, వీఆర్వో కుమార్ పాల్గొన్నారు.

భువనేశ్వరి సభకు తరలిన టీడీపీ నేతలు

వింజమూరు, ఫిబ్రవరి 1: మండల పార్టీ అధ్యక్షుడు గొంగటి రఘునాథరెడ్డి ఆధ్వర్యంలో గురువారం కొండాపురం మండలంలో నిజం గెలవాలి కార్యక్రమంలో నారా భువనేశ్వరి బహిరంగ సభకుమండలంలోని టీడీపీ నాయకులు తరలివెళ్లారు. పలు వాహనాల్లో కార్యకర్తలు భారీగా తరలివెళ్లారు.

నేడు కలువాయికి రాక

కలువాయి : టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు సతీమణి భువనేశ్వరి శుక్రవారం ఉదయం 11గంటలకు కలువాయికి రానున్నట్లు మండల పార్టీ అధ్యక్షుడు జీ వెంకటేశ్వర్లు నాయుడు తెలిపారు. చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టును తట్టుకోలేక మనోవేదనకు గురై మృతిచెందిన బొరిగర్ల చెన్నయ్య కుటుంబ సభ్యులను ఆమె పరామర్శించనున్నట్లు తెలిపారు. కాగా, గురువారం టీడీపీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ మస్తాన్ యాదవ్ బొరగర్ల చెన్నయ్య కుటుంబ సభ్యులను కలసి భువనేశ్వరి వస్తున్న విషయాన్ని తెలియజేశారు. ఆయన వెంట టీడీపీ సీనియర్ నాయకుడు అల్లంపాటి వేణుగోపాల్ రెడ్డి తదితరులు ఉన్నారు.

టిడ్కో గృహ సముదాయంలో వసతులు కల్పించాలి



తాగునీటి పైపులైను లీకేజీని పరిశీలిస్తున్న సీపీఎం నేత డేవిడ్‌రాజు

ఆత్మకూరు, ఫిబ్రవరి 1 : మున్సిపాల్టీ పరిధిలోని టిడ్కో గృహ సముదాయంలో మెరుగైన వసతులు కల్పించాలని సీపీఎం పట్టణ కార్యదర్శి కె డేవిడ్‌రాజు కోరారు. గురువారం ఆయన టిడ్కో గృహాలను పరిశీలించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పైపులైను లీకు కావడంతో నీటి సరఫరా సమస్యగా మారిందని, డ్రైనేజి వ్యవస్థ అధ్వానంగా ఉందని, 1056 టిడ్కో గృహాలు ఉంటే కనీసం సగం మంది కూడా నివాసం ఉండే పరిస్థితి లేదన్నారు. ముఖ్యంగా తాగునీటి సౌకర్యం లేకపోవడంతో లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. టిడ్కో గృహసముదాయంలో మెరుగైన సదుపాయాలు కల్పించకపోతే చలో కలెక్టరేటుకు పిలుపునిచ్చి పోరాడుతామని హెచ్చరించారు.

ఇళ్ల రిజిస్ట్రేషన్ల ప్రారంభం

ఉదయగిరి, ఫిబ్రవరి 1: మండలంలోని 12 సచివాలయాల పరిధిలో పేదలందరికీ ఇళ్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభమైందని ఈవోపీఆర్డీ ఎన్ మల్లికార్జున గురువారం తెలిపారు. మండలంలో 900 మందికిపైగా ఇంటి స్థలాలు పొందిన లబ్ధిదారులకు ఇళ్ల రిజిస్ట్రేషన్ చేయాల్సి ఉందని, లబ్ధిదారులు సచివాలయ సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు.

గ్రామ జలసంఘం కమిటీలు ఏర్పాటు చేయాలి

ఉదయగిరి రూరల్, ఫిబ్రవరి 1: జలజీవన్ మిషన్ కింద గ్రామ జలసంఘ కమిటీలు ఏర్పాటు చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రవీంద్రనాథ్ సూచించారు. గురువారం స్థానిక స్త్రీశక్తి భవనంలో పొదుపు మహిళలు, సచివాలయ సిబ్బందితో సమీక్షించారు. జలజీవన్ మిషన్ కింద పంచాయతీల్లో కార్యదర్శి, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌తోపాటు తొమ్మిది పొదుపు సభ్యులతో సంఘం ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం ఖాజారంతుల్లా, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భూహక్కు-భూరక్షపై అవగాహన

ఉదయగిరి, ఫిబ్రవరి 1: మండలంలోని వెంగళరావునగర్ గ్రామంలో గురువారం వైఎస్ఆర్ జగనన్న శాశ్విత భూహక్కు, భూరక్ష పథకంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తహసీల్దారు సానా శ్రీనివాసులరెడ్డి మాట్లాడుతూ ప్రతి రైతు తమ భూమి వివరాలు సంబంధిత సిబ్బందికి అందజేసి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తిరుపతయ్య, పంచాయతీ కార్యదర్శి అమర్‌నాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మన ఫౌండేషన్ ఆధ్వర్యంలో పలువురికి ఆర్థిక సాయం

ఉదయగిరి రూరల్, ఫిబ్రవరి 1: మాజీ ఏఎంసీ చైర్మన్, మన ఫౌండేషన్ అధినేత మన్నేటి వెంకట రెడ్డి గురువారం పలువురికి ఆర్థిక సాయం చేశారు. ఉదయగిరి పట్టణం ఎస్సీ కాలనీలో అనారోగ్యంతో బాధపడుతున్న రమణయ్యకు రూ.10 వేలు, నాగిళ్ల వెంకటపతికి రూ.5 వేలు, మాసాయిపేట గ్రామానికి చెందిన రమణయ్య మృతిచెందడంతో ఉత్తరక్రియలకు ఆర్థికసాయం అందజేశారు. అలాగే ఉదయగిరి పట్టణంలో ఎస్టీ కాలనీలో మంచినీటి పథకం మోటార్‌కు తన సొంత నిధులు వెచ్చించి మరమ్మతులు చేయించి కాలనీ వాసుల తాగునీటి కష్టాలు తీర్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బొజ్జా నరసింహులు, నల్లిపోగు రాజా, నరసింహా, ఓబులరెడ్డి, గూడూరు వెంకటేశ్వరరావు, గాజుల రంతుజానీ, అర్షద్, బాబు తదిదతరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన



ఆత్మకూరు, ఫిబ్రవరి 1 : మండలంలోని కనుపూరుపల్లిలో గురువారం సీసీ రోడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. అనంతరం సైడ్ డ్రైన్లను ప్రారంభించారు. అనంతరం ఆయన గ్రామంలో విజయీభవ యాత్ర నిర్వహించి ప్రజలను అడిగి సమస్యలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మండలాధ్యక్షుడు కేతా వేణుగోపాల్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ సభ్యుడు డాక్టర్ సీహెచ్ ఆదిశేషయ్య, పలువురు ప్రజాప్రతినిధులు, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

ఆత్మకూరు మున్సిపల్ కమిషనర్‌గా షేక్ ఫజుల్లుల్లా

ఆత్మకూరు, ఫిబ్రవరి 1: ఆత్మకూరు నూతన మున్సిపల్ కమిషనర్‌గా షేక్ ఫజుల్లుల్లా గురువారం బాధ్యతలు చేపట్టారు. ప్రకాశం జిల్లా చీమకుర్తి మున్సిపల్ కమిషనర్‌గా పనిచేస్తున్న ఆయన బదిలీపై ఆత్మకూరు వచ్చారు. విధులు చేపట్టిన అనంతరం ఆయన మాట్లాడుతూ మున్సిపాల్టీ పరిధిలో పారిశుధ్యం, తాగునీటి సరఫరా తదితర సమస్యల సత్వర పరిష్కారానికి చర్యలు చేపడతామని తెలిపారు. అనంతరం ఆయన ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఆయన వెంట ఆర్ఐ ఖాసీం ఉన్నారు.

రేపు సామాజిక తనిఖీ ప్రజావేదిక

వరికుంటపాడు, ఫిబ్రవరి 1: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో శనివారం 15వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించనున్నట్లు ఎంపీడీవో శ్రీదేవి తెలిపారు. గురువారం ఆమె మాట్లాడుతూ మండలంలో 2022 ఏప్రిల్ నుంచి గతేడాది మార్చి వరకు జరిగిన ఉపాధి హామీ పథకం పనులు, వేతన చెల్లింపులపై గ్రామాల్లో తనిఖీలు చేపట్టి గ్రామసభలు నిర్వహించడం జరిగిందన్నారు. అనంతరం పంచాయతీల వారీగా సేకరించిన నివేదికలను ప్రజావేదికలో డీఆర్‌పీలు బహిర్గతం చేయడం జరుగుతుందన్నారు. కావున ప్రజాప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు. పంచాయతీ కార్యదర్శులు తప్పక హాజరుకావాలని కోరారు.

కావలి
కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

వెల్లువెత్తిన అభిమానం

● భువనేశ్వరిని చూసేందుకు తరలివచ్చిన ప్రజలు



కొండాపురం : కొమ్మి గ్రామంలో మాట్లాడుతున్న నారా భువనేశ్వరి

గుడ్లూరు/లింగసముద్రం/కొండాపురం/కావలి రూరల్ : 'నిజం గెలవాలి' కార్యక్రమంలో భాగంగా గుడ్లూరు, లింగసముద్రం, కొండాపురం మండలాల్లో పర్యటించిన టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు సతీమణి నారా భువనేశ్వరిని చూసేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలతోపాటు అభిమానులు, ప్రజలు, మహిళలు భారీగా తరలివచ్చారు. మండల కేంద్రమైన గుడ్లూరు, దారకానిపాడు గ్రామాల్లో ప్రజలు ప్రత్యేకించి మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని ఘనస్వాగతం పలికారు. అలాగే గుడ్లూరు నుంచి కొండాపురం మండలం కొమ్మి గ్రామానికి వెళుతూ మార్గమధ్యంలో గ్రామ టీడీపీ నాయకులు సోంపల్లి మనోహర్, టీడీపీ కార్యకర్తల వినతి మేరకు కొద్దిసేపు ఆగారు. ఈ సందర్భంగా భువనేశ్వరి అందరినీ ఆప్యాయంగా పలకరించి ప్రతి కార్యకర్తకి టీడీపీ అండగా ఉంటుందని, పార్టీ గెలుపుకు అంతా కృషి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా సోంపల్లి శిరీషతోపాటు పలువురు భువనేశ్వరికి శాలువా కప్పి సత్కరించారు. అనంతరం ఆమె ప్రజలకు అభివాదం చేసి, విక్టరీ సింబల్‌ను చూపిస్తూ ప్రజలను ఉత్సాహపరిచారు. భువనేశ్వరి వెంట టీడీపీ నాయకులు దివి సౌభాగ్యం, జనిగర్ల నాగరాజు, చెన్నారెడ్డి మహేష్, పువ్వాడి వేణు, రావూరి వేణు, సోంపల్లి మనోహర్, ఉమ్మనేని నరసింహారావు, ఎంపీటీసీ తూమాటి గిరిజమ్మ, బోయపాటి వెంటేశర్వర్లు, మోతుకూరి పర్వతాలు, మాధవరపు బ్రహ్మయ్య, పి మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు. అలాగే కొండాపురం మండలం కొమ్మి గ్రామంలో తాటిపర్తి సుధాకర్ కుటుంబాన్ని భువనేశ్వరి పరామర్శించి, ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అందరి భవిష్యత్తు కోసం చంద్రబాబు అహర్నిశలు కృషి చేస్తున్నారని అన్నారు. ఆమె వెంట టీడీపీ రాష్ట్రకార్యదర్శి శాంతకుమారి, నాయకులు చెంచలబాబు, తాళ్లపాక అనూరాధ, మాహిళ్లపల్లి ఓంకారం, యారవ క్రిష్ణయ్య, వెంకటాద్రి తదితరులు పాల్గొన్నారు.

● కాకర్ల ఆదుకున్నాడమ్మా...

చంద్రబాబునాయుడు అక్రమ అరెస్టును తట్టుకోలేక తన భర్త తాటిపర్తి సుధాకర్ మరణించగా, ఎవరూ పట్టించుకోలేదని కాకర్ల సురేష్ తమను ఆదుకున్నాడని సుధాకర్ భార్య వెంగమ్మ గురువారం నారా భువనేశ్వరితో అన్నారు. తమ కాలనీలోని కొందరు యువకులు సురేష్‌కు చెప్పడంతో తక్షణమే రూ. 50 వేలు ఇవ్వడమేకాక దశదినకర్మకు కూడా ఆర్థిక సహాయం చేశాడని తెలిపింది.

● కొత్తపల్లిలో పైలాన్ సందర్శన

నిజం గెలవాలి కార్యక్రమంలో భాగంగా కొండాపురం మండలం కొమ్మి గ్రామం నుంచి నెల్లూరు వెళ్తున్న నారా భువనేశ్వరి గురువారం కావలి మండలం కొత్తపల్లిలో ఏర్పాటు చేసిన యువగళం పైలాన్‌ను సందర్శించారు. ఆమెకు టీడీపీ నాయకులు పొన్నగంటి రవీంద్రనాథ్, రాజా ల ఆధ్వర్యంలో రైతులు, మహిళలు ఘనస్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ పంచుమర్తి అనూరాధ, రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు గుంటుపల్లి శ్రీదేవి చౌదరి, నాయకులు గుత్తికొండ కిషోర్, పోతుగంటి అలేఖ్య, శ్రీకాంత్, జ్యోతి బాబురావు, అన్నదాత మణి, దామా మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు. కాగా అలాగే కావలి పట్టణ నాయకులు, మహిళలు భువనేశ్వరికి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమెతో ఫొటోలు దిగారు.

నారా భువనేశ్వరితో టీడీపీ నేతల భేటీ



శ్రీగాయత్రి డిగ్రీ కళాశాల విద్యార్థినులతో మాట్లాడుతున్న భువనేశ్వరి



ఎన్టీఆర్ ఫొటోను భువనేశ్వరికి అందజేస్తున్న నూకసాని బాలాజీ, ఇంటూరి తదితరులు

కందుకూరు, ఫిబ్రవరి 1: నిజం గెలవాలి కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చి పట్టణ శివార్లలో బుధవారం రాత్రి బసచేసిన టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు సతీమణి భువనేశ్వరిని గురువారం ఉదయం ఆపార్టీ నాయకులు కలిశారు. నియోజకవర్గ ఇన్‌చార్జి ఇంటూరి నాగేశ్వరరావు, సౌజన్య దంపతులతోపాటు మాజీ ఎమ్మెల్యే, పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దివి శివరాం, ఆయన సతీమణి దివి సౌభాగ్య, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఆయన సతీమణి సరిత, జిల్లా డెయిరీ చైర్మన్ చల్లా శ్రీనివాసరావు, టీడీపీ ఒంగోలు పార్లమెంటు అధ్యక్షుడు నూకసాని బాలాజీ, ఒంగోలు మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ తదితరులు ఆమెను కలిసి పార్టీ పరిస్థితులను వివరించారు.

● విద్యార్థినుల ఆత్మీయ స్వాగతం

ఆలావారి కళ్యాణ మండపం వద్ద నుంచి గుడ్లూరు మండలానికి వెళ్లేందుకు బయలుదేరిన భువనేశ్వరికి ఓవీ రోడ్డులో ఉన్న శ్రీగాయత్రీ కళాశాల విద్యార్థినులు ఆత్మీయస్వాగతం పలికారు. దీంతో భువనేశ్వరి కారు ఆపి హాయ్ చిల్డ్రన్స్. అంటూ చిరునవ్వుతో పలకరించారు. కారు దిగి వారిని పలుకరించారు. ఎలా ఉన్నారు, ఏం చదువుతున్నారు, అంతా హ్యాపీయేనా ? అంటూ కుశలప్రశ్నలు వేశారు. వారంతా ముక్తకంఠంతో ఫైన్ మేడమ్ అని సమాధానం చెప్పారు. కందుకూరు నుంచి గుడ్లూరు వెళ్లే మార్గంలోనూ అక్కడి నుంచి కొండాపురం వెళ్లే మార్గంలోని గ్రామాలలోనూ మహిళలు పెద్దఎత్తున భువనేశ్వరికి స్వాగతం పలికారు.

సమాజసేవకే బోగిరి కుటుంబం అంకితం



మణెమ్మ (ఫైల్)

బిట్రగుంట, ఫిబ్రవరి 1: సమాజసేవకే బోగిరి కుటుంబం అంకితమయిందని కావలి టీడీపీ నాయకులు కావ్య కృష్ణారెడ్డి, పసుపులేటి సుధాకర్ అన్నారు. బోగోలు మాజీ సర్పంచు బోగిరి మణెమ్మ ఇటీవల మృతి చెందారు. ఆమె కుటుంబ సభ్యులను గురువారం పలువురు అధికారులు, నేతలు, దళితగిరిజన నాయకులు పరామర్శించారు. మణెమ్మకు నివాళులు అర్పించారు. అనంతరం వారు మాట్లాడుగూ మణెమ్మ భర్త యోహాను రైల్వే ఉద్యోగిగా పనిచేస్తూ ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టారని తెలిపారు. ఆమె కుమారుడు ప్రభాకర్ గిరిజన నాయకుడిగా సేవలు అందిస్తున్నారని తెలిపారు. మణెమ్మ చిత్రపటానికి నెల్లూరు మేయర్ పోట్లూరి స్రావంతి, దళిత సంఘాల నేతలు మొగిలి కల్లయ్య, ఎన్.మోహన్‌దర్శ, ఎస్.మల్లి పూలమాలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ వెంకటేశ్వర్లు, సర్పంచులు అనిత, మాచర్ల, నేతలు వీరరఘు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధి బీజేపీతోనే సాధ్యం



మాట్లాడుతున్న భరత్‌కుమార్

బిట్రగుంట, ఫిబ్రవరి 1: రాష్ట్రం అన్ని విధాలా అభివృద్ధి చెందాలంటే బీజేపీతోనే సాధ్యమని ఆ పార్టీ రాష్ట్ర నేతలు భరత్‌కుమార్, కందుకూరి వెంకటసత్యనారాణ అన్నారు. బోగోలు మండలం ఇబ్రహీంపేటలో గురువారం పార్టీ మండల అధ్యక్షుడు నూకసాని శ్రీనివాసులు యాదవ్ ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయ ప్రారంభోత్సవం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో బీజేపీని గెలిపించుకుంటే మరింత అభివృద్ధి జరుగుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎస్.రాజ్యలక్ష్మి, సీవీసత్యం, కే.బ్రహ్మానందం, జీ.వెంకటేశ్వర్లు, డీ.మధు, ఎల్.మధుసూదన్‌రావు తదితరులు ఉన్నారు.

ప్రతి లబ్ధిదారుడి గృహం రిజిస్ట్రేషన్ : ఆర్డీవో




రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలిస్తున్న ఆర్డీవో శీనానాయక్

అల్లూరు, ఫిబ్రవరి 1: ప్రతి లబ్ధిదారుడికి ప్రభుత్వం అందించిన జగనన్న పక్కా గృహానికి రిజిస్ట్రేషన్ ప్రారంభమయిందని, ఈ ప్రక్రియ గురువారం నుంచి మొదలు పెట్టినట్లు కావలి ఆర్డీవో శీనానాయక్ తెలిపారు. స్థానిక సబ్‌రిజిస్ట్రారు కార్యాలయంలో జరుగుతున్న గృహాల రిజిస్ట్రేషన్‌ను ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ సచివాలయాల ద్వారా ఈ ప్రక్రియను చేపట్టాల్సి ఉండగా, ప్రస్తుతం సబ్‌రిజిస్ట్రారు కార్యాలయంలో ప్రారంభించామన్నారు. అల్లూరులో ఈ ప్రక్రియ వేగవంతంగా జరుగుతుందని సబ్‌రిజిస్ట్రారు బీ ప్రసన్నలక్ష్మిని ఆయన ప్రశంసించారు. కార్యక్రమంలో తహసీల్దారు చంద్రశేఖర్, సబ్‌రిజిస్ట్రారు కార్యాలయ సిబ్బంది వంశీకృష్ణ, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పెదపవని గురుకులానికి ఉత్తమ గ్రీన్ పాఠశాల అవార్డు

లింగసముద్రం, ఫిబ్రవరి 1: మండలంలోని పెదపవనిలో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల బాలికల పాఠశాలకు కేంద్ర అటవీ, పర్యావరణ మంత్రిత్వశాఖ ఉత్తమ గ్రీన్ పాఠశాల అవార్డును అందజేసింది.గత నెల 30న ఢిల్లీలో జరిగిన ఓ కార్యక్రమంలో అవార్డును అందించినట్లు ప్రిన్సిపాల్ కే స్నేహలత గురువారం చెప్పారు. తమ పాఠశాల కో-ఆర్డినేటర్, ఫిజిక్స్ అధ్యాపకురాలు జీ నాగవేణి ఢిల్లీలో సీఎస్ఈ డైరెక్టర్ సునీత నుంచి ఈ అవార్డును అందుకున్నారని ఆమె చెప్పారు.ఈ అవార్డు తమకు రావడంతో గురువారం రాష్ట్ర గురుకుల పాఠశాలల కార్యదర్శి ఆర్ మహేష్‌కుమార్ తాడేపల్లిలో తనకు ప్రశంసాపత్రం అందించారని ఆమె చెప్పారు.

హెల్మెట్ తప్పనిసరి



బైక్ ర్యాలీని ప్రారంభిస్తున్న ఎంవీఐ సుందర్‌రావు

కావలి రూరల్ : ద్విచక్ర వాహనం నడిపేటప్పుడు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని ఎంవీఐ సుందరరావు పేర్కొన్నారు. జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా గురువారం స్థానిక విట్స్ కళాశాల నుంచి ఆర్టీసీ బస్టాండ్ వరకు ద్విచక్ర వాహనాలతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంవీఐ సుందరరావు, అసిస్టెంట్ ఎంవీఐ కరుణాకర్, ఒకటవ పట్టణ ఎస్ఐ అంబేద్కర్ తదితరులు పాల్గొన్నారు.

7న గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టుకు ఇంటర్వ్యూలు

కందుకూరు : స్థానిక టీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల7న కెమిస్ట్రీ సబ్జెక్టు గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టుకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టరు ఎం. రవికుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత సబ్జెక్టులో పీజీలో 55 శాతం మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలని, అదనపు అర్హతలు, బోధనానుభవం కలిగిన వారికి ప్రాధాన్యం ఇస్తామన్నారు. నెలకు గరిష్ఠంగా రూ. 28వేలు వేతనం ఇస్తామని తెలిపారు. ఆసక్తికలవారు 7వ తేదీ ఉదయం 10 గంటలకు ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఇంటర్వ్యూకి హాజరుకావాలని కోరారు.

ఆటోనగర్‌గా సర్వీసు రోడ్లు

● రోడ్డుపైనే బైక్‌ల మరమ్మతులు



ఉదయగిరి రోడ్డుపై బైక్‌ల మరమ్మతులు

కావలి,ఫిబ్రవరి1: కావలి నడిబొడ్డున ఉన్న ఉదయగిరి బ్రిడ్జికి ఇరువైపులా ఉన్న సర్వీసు రోడ్లు మోటారు సైకిళ్ల, ఆటో రిపేర్ల మెకానిక్‌లతో నిండిపోయాయి. ఇది ఆటోనగరా? లేక రోడ్డునా.. అంటూ పలువురు సందేహిస్తున్నారు. గతంలో మెకానిక్‌ల కోసం ముసునూరు మందాటి చెరువు వద్ద స్థలాలు కేటాయించగా, వాటిని విక్రయించుకుని బ్రిడ్జి కిందకు చేరారు. వంతెనకు ఇరువైపులా రోడ్లను పూర్తిగా ఆక్రమించి బైక్‌ల మరమ్మతులు చేస్తున్నారు. దీంతో ఆ ప్రాంతంలో రాకపోకలకు ప్రజలు తీవ్రఇబ్బందులు పడుతున్నారు. అయినా పోలీస్, మున్సిపల్ అధికారులు పట్టించుకోవ టంలేదనే విమర్శలు ఉన్నాయి. ఉన్నతాధికారులు స్పందించి రోడ్లపై ఆక్రమణలు తొలగించాల్సి ఉంది.

ఉచిత కంప్యూటర్ శిక్షణ ప్రారంభం

కావలిటౌన్, ఫిబ్రవరి 1: ప్రముఖ వ్యాపారవేత్త వేలూరు జయచంద్రనాయుడు సౌజన్యంతో గురువారం ఉచిత కంప్యూటర్ శిక్షణ ప్రారంభమైంది. వెంగళరావునగర్‌లోని రోటరీక్లబ్ కార్యాలయంలో సంయుక్త సేవాసంస్థ పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నిరుద్యోగులు కంప్యూటర్ శిక్షణ పొంది నైపుణ్యం పెంపొందించుకుంటే ఉపాధి అవకాశాలు మెండుగా లభిస్తాయన్నారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు జీ సురేంద్ర, ఖాదర్‌బాషా, ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల మన్ననల్ని పొందండి

అల్లూరు, ఫిబ్రవరి 1: ప్రతి ఒక్కరూ ఓర్పుగా పనిచేసి, ప్రజల మన్ననల్ని పొందాలని తహసీల్దారు చంద్రశేఖర్ అన్నారు. అల్లూరు తహసీల్దారును పల్నాడు జిల్లాకు బదిలీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బంది ఆయనకు గురువారం ఘనంగా వీడ్కోలు పలికారు.కార్యక్రమంలో డీటీ నాగలక్ష్మి, సైమన్‌బాబు, సీనియర్ అసిస్టెంట్ సుధీర్, వీఆర్వోలు, సచివాలయ సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

ట్రైసైకిళ్ల పంపిణీ



దివ్యాంగులతో మాట్లాడుతున్న సుగుణమ్మ

కావలిటౌన్ : దివ్యాంగులు దైవస్వరూపులని, వారికి సేవచేయడం సామాజిక బాధ్యతని పీఎస్సార్ చారిటబుల్ ట్రస్ట్ అధినేత పసుపులేటి సుధాకర్ సతీమణి పసుపులేటి సుగుణమ్మ పేర్కొన్నారు. ట్రస్ట్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో దివ్యాంగులకు ట్రైకిళ్లను పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ తన భర్త సుధాకర్ గెలుపోట ములతో పనిలేకుండా ముందుకు పోతున్నారన్నారు.

పోషకాహారంతోనే వ్యాధి నిరోధక శక్తి

కలిగిరి : అదనపు పోషకాహారంతో వ్యాధినిరోధకశక్తి పొందేందుకు వీలు కలుగుతుందని కలిగిరి పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ బిజ్జం గీతారెడ్డి పేర్కొన్నారు. స్థానిక పీహెచ్‌సీ పరిధిలోని 16మంది క్షయ వ్యాధిగ్రస్థులకు గురువారం అదనపు పోషకాహార కిట్స్ అందచేశారు. అనంతరం మందులు అందచేశారు. కార్యక్రమంలో సాయిలక్ష్మి, శివ, షబ్బీర్, పీహెచ్‌సీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్లేట్లు, ప్యాడ్‌ల పంపిణీ

బుచ్చిరెడ్డిపాళెం, ఫిబ్రవరి1: స్థానిక ఖాజానగర్ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు గురువారం సహారా ఎడ్యుకేషనల్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో ప్లేట్లు, పరీక్ష ప్యాడ్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంఈవో దిలీప్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదుకుని తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు ఎజ్దానీబాషా, హెచ్ఎం టీ మస్తానయ్య, మల్లేశ్వర్‌రెడ్డి, మహేష్‌బాబు, సురేఖ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమానికి సహకరించిన దాత అక్బర్‌కు ధన్యవాదాలు తెలిపారు.

జొన్నవాడలో నేడు పుష్పయాగం

బుచ్చిరెడ్డిపాళెం, ఫిబ్రవరి1: మండలంలోని జొన్నవాడ ఆలయంలో శుక్రవారం సాయంత్రం ఆరు గంటలలకు కామాక్షితాయికి పుష్పయాగం నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ పుట్టా సుబ్రహ్మణ్యంనాయుడు,ఈవో వీ గిరికృష్ణ తెలిపారు. కార్యక్రమంలో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొనాలని కోరారు.

జగదేవిపేట పీహెచ్‌సీ తనిఖీ

ఇందుకూరుపేట, ఫిబ్రవరి 1: మండలంలోని జగదేవిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రా(పీహెచ్‌సీ)న్ని ప్రోగ్రామ్ ఆఫీసర్, జిల్లా ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ పీఎల్.దయాకర్ గురువారం సందర్శించారు. హాజరు పట్టికతోపాటు పలు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా వైద్యసిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆసుపత్రిలో కాన్పులు జరిగేటట్లు చూడాలన్నారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కిషోర్‌కుమార్, హెచ్‌ఈవో శ్రీనివాసరావు, హెల్త్ ఎడ్యుకేటర్ సుధాకర్‌రావు, హెల్త్ సూపర్‌వైజర్ రమ, సతీష్, ఫార్మాసిస్ట్ చంద్రశేఖర్, హెల్త్ అసిస్టెంట్ మాధవ, తదితరులు పాల్గొన్నారు.

చౌకదుకాణంలో సరుకులు ఇవ్వాలి

కోవూరు, ఫిబ్రవరి1: పడుగుపాడులోని 21వ చౌకదుకాణంలో ఐదు నెలలుగా సరుకులు ఇవ్వడంలేదని బీఎస్పీ నాయకులు పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం వారు తహసీల్దారు కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. సరుకులు ఇవ్వనందున పేదలు తీవ్ర ఇబ్బందులకు గురవతున్నారని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి కడింపాటి అశోక్‌కుమార్, నియోజకవర్గ ఇన్‌చార్జి ముదివర్తి కృష్ణమూర్తిలు తెలిపారు. పరిశీలించి చర్యలు తీసుకోవాల్సిందిగా కోరారు.

మాజీ వార్డు సభ్యుడి మృతి

కోవూరు, ఫిబ్రవరి1: కోవూరు పంచాయతీలో వరుసగా మూడుసార్లు వార్డు సభ్యుడిగా గెలుపొంది సేవలందించిన పూండ్ల ఐజాక్ జాన్‌మిల్టన్(57) గురువారం గుండెపోటుతో మృతిచెందారు. స్థానిక దళితకాలనీకి చెందిన ఆయన టీడీపీ ఎస్సీ సెల్ మండల కమిటీ అధ్యక్షుడిగా చాలాకాలం పనిచేశారు. సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనేవారు. కబడ్డీని ప్రోత్సహిస్తూ పోటీల్ని నిర్వహించేవారు. ఆయన మృతదేహానికి మాజీ ఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, టీడీపీ నాయకులు ఇంతా మల్లారెడ్డి, బాలారవి, ధారా విజయబాబు తదితరులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

రాపూరు ఎంపీడీవోగా రంగయ్య

రాపూరు(డక్కిలి), ఫిబ్రవరి 1 : రాపూరు ఎంపీడీవోగా రంగయ్య శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఎన్నికల బదిలీల్లో భాగంగా చిత్తూరు జిల్లా కలిగిరి మండలం నుంచి ఇక్కడికి బదిలీ అయ్యారు. కాగా, ఎండీవోను కార్యాలయ సిబ్బంది, పలు రాజకీయ పార్టీలకు చెందిన నేతలు మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు.

సైదాపురం ఎమ్పీడీవోగా..

సైదాపురం : స్థానిక ఎంపీడీవో కార్యాల యంలో గురువారం సాయం త్రం నూతన ఎంపీడీవోగా జి సుధాకర్ బాధ్యతలు చే'ట్టారు. ఆయనకు ఎంపీడీవో కార్యలయం సిబ్బంది స్వాగతం పలికారు.

కులగణన సర్వే వేగవంతం చేయాలి

మనుబోలు, ఫిబ్రవరి 1: కులగణన సర్వే వేగవంతం చేయాలని, ఫిబ్రవరి 2వ తేదీతో గడువు ముగుస్తుందని ఇన్‌చార్జి ఎంపీడీవో జీవిఎస్‌వి ప్రసాద్ తెలిపారు. మండలంలోని వెంకన్నపాళెం గ్రామంలో జరుగుతున్న కులగణన సర్వేను ఆయన గురువారం పరిశీలించారు. సర్వే చేస్తున్న సిబ్బందికి సలహాలు, సూచనలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీనువాసులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీల్లో అక్రమాలపై

విజిలెన్స్ విచారణ చేపట్టాలి

● తహసీల్దార్ కార్యాలయం ఎదుట టీడీపీ నేతల నిరసన



తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న టీడీపీ నాయకులు

వెంకటాచలం, ఫిబ్రవరి 1: జగనన్న కాలనీలలో ఇళ్ల స్థలాల పంపిణీలో, లెవెలింగ్ పేరిట జరిగిన రూ.కోట్ల రుపాయల అవినీతి, అక్రమాలపై ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి విజిలెన్స్ విచారణ చేపట్టి వాస్తవాలను నిగ్గుతేల్చాలని టీడీపీ మండలాధ్యక్షుడు గుమ్మడి రాజాయాదవ్ డిమాండ్ చేశారు. వెంకటాచలంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట గురువారం ఆపార్టీ నాయకులు నిరసన చేపట్టి అనంతరం కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ వెంకటేష్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జగనన్న ఇళ్ల స్థలాల మాటున వైసీపీ నాయకులు అవినీతి, అక్రమాలకు పాల్పడ్డారని, విజిలెన్స్ విచారణ చేపట్టి అవినీతి, అక్రమాలను నిగ్గుతేల్చకుంటే టీడీపీ ఆధ్వర్యంలో ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రావూరి రాధాకృష్ణమనాయుడు, మావిళ్లపల్లి శ్రీనివాసులునాయుడు, చల్లా నాగార్జున్‌రెడ్డి, వల్లూరు రమేష్‌నాయుడు, ఈపూరు మురళీధర్‌రెడ్డి, రావూరి పద్మనాభనాయుడు, తదితరులున్నారు.

టీడీపీతోనే మైనార్టీల అభ్యున్నతి

మైనార్టీల అభ్యున్నతి టీడీపీతోనే సాధ్యమని టీడీపీ మండలాధ్యక్షుడు గుమ్మడి రాజాయాదవ్, టీడీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి షేక్ అబూబకర్ అన్నారు. వెంకటాచలంలోని ఆపార్టీ కార్యాలయంలో గురువారం వారు మైనార్టీ నాయకులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి గెలుపులో మైనార్టీలు కీలక పాత్ర పోషించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ మైనార్టీ సెల్ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి పఠాన్ ఖయ్యూమ్ ఖాన్, కార్యదర్శి షేక్ సత్తార్ సాహెబ్, నియోజకవర్గ అధికార ప్రతినిధి సయ్యద్ అన్వర్, పలువురు మైనార్టీ నాయకులున్నారు.

శిలాఫలకాలకే పరిమితమైన ప్రసన్న: దినేష్



విలేకరులతో మాట్లాడుతున్న దినేష్‌రెడ్డి

ఇందుకూరు పేట, ఫిబ్రవరి 1: ప్రజా సమస్యలను పట్టించుకోకుండా ఎమ్మెల్యే నల్లప రెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి శిలాఫలకాలకే పరి మితమయ్యాడని కోవూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి పోలంరెడ్డి దినేష్‌రెడ్డి అన్నారు. మండలంలోని మైపాడులో గురువారం ప్రతి అడుగు ప్రజల కోసం కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటికి తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ జగన్మోహన్‌రెడ్డిని ఇంటికి పంపించడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. కళ్ల ముందు కనిపిస్తున్న ఓటమిని జగన్ జీర్ణించుకోలేకపోతున్నారని తెలిపారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ- జనసేన కూటమి ఘన విజయం సాధిస్తుందని తెలి పారు. కార్యక్రమంలో రావెళ్ల వీరేంద్రచౌదరి, చెంచుకిషోర్ యాదవ్, గంపల అనిల్ కుమార్, లెనిన్‌బాబు, కటారిబాబు, అవ్వారు ఏడుకొండలు, శేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎంఈవో సేవలు ప్రశంసనీయం : మేయర్ స్రవంతి



రాపూరు ఎంఇవోని సన్మానిస్తున్న నెల్లూరు మేయిర్ పొట్లూరు స్రవంతి

రాపూరు(డక్కిలి), ఫిబ్రవరి 1 : రాపూరు ఎంఇవో గుండవేలు శ్రీనివాసులు విధి నిర్వహణలో అందిస్తున్న సేవలు ప్రశంనీయం అని నెల్లూరు మేయర్ పొట్లూరు స్రవంతి అన్నారు. ఈమేరకు శుక్రవారం రాపూరులో నిర్వహించిన ఆత్మీయ సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై ఎంఇవో శ్రీనివాసులను సత్కరించారు. ఇంకా పలు ఉపాధ్యాయ సంఘాల నేతలు, పెంచకోన నృసింహస్వామి దేవస్థానం మాజీ చైర్మన్ నెల్లూరు రవీంద్రారెడ్డి తదితరులు ఎంఇవో సేవలను కొనియాడారు.

మహిళలకు ఆసరా చెక్కుల పంపిణీ



మాట్లాడుతున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

వెంకటాచలం, ఫిబ్రవరి 1 : మండలంలోని సర్వేపల్లిలో గురువారం వైఎస్ఆర్ ఆసరా నాలుగో విడత నగదు పంపిణీ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పాల్గొని మాట్లాడుతూ ఇప్పటికే మహిళల ఖాతాల్లో ఒక్కొక్కరికి రూ.18,750 వంతున జమ చేశామని, 4వ విడత క్యాబినెట్ నిర్ణయం మేరకు ఫిబ్రవరి 16వ తేదీన జమ చేయనున్నట్లు తెలిపారు. అనంతరం సర్వేపల్లి రిజర్వాయర్‌లో చేప పిల్లలను వదిలారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ సాంబశివరెడ్డి, జడ్పీటీసీ పొట్లూరి సుబ్రహ్మణ్యం, ఎంపీపీ మంద కవిత, వైస్ ఎంపీపీ కనుపూరు కోదండరామిరెడ్డి, వైసీపీ మండల కన్వీనర్ కొనిదెన మోహన్‌నాయుడు, సచివాలయాల మండల కన్వీనర్ వెంకటశేషయ్య, పలువురు వైసీపీ నాయకులు ఉన్నారు.

అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు

పొదలకూరు, ఫిబ్రవరి 1: మండలంలోని ప్రభగిరిపట్నం గ్రామంలో గురువారం సాయంత్రం రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి వివిధ అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు చేశారు. తొలుత ఆయన రూ.43.50 లక్షల వ్యయంతో నిర్మించిన గ్రామ సచివాలయ భవనం, డ్రైన్లకు ప్రారంభోత్సవం చేశారు. అనంతరం ఆయన పొదలకూరు పట్టణంలోని అగచాటపురంలో జరిగిన హజరత్ ఖాదర్‌వలి గంధ మహోత్సవ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పొదలకూరు మండల ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

సిబ్బంది పనితీరు మెరుగుపరచుకోవాలి

● జిల్లా పంచాయతీ అధికారి సుస్మితారెడ్డి



రికార్డులు పరిశీలిస్తున్న డీపీవో

తోటపల్లిగూడూరు, ఫిబ్రవరి 1 : సచివాలయ సిబ్బంది పనితీరు మెరుగుపర్చుకోవాలని, ప్రతి విషయం రికార్డులో నమోదు కావాలని జిల్లా పంచాయతీ అధికారి సుస్మితరెడ్డి సూచించారు. గురువారం మండలంలోని వరిగొండ సచివాలయం-1లో పంచాయతీ రికార్డులను ఆమె పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ గ్రామాల్లో ఉండి వారి అవసరాల నిమిత్తం బయట ఉంటే వారందరూ కులగణనను చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ నారాయణరెడ్డి, కులగణన విస్తరణ అధికారి రాంప్రసాద్, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నేడు రాపూరులో 'నిజం గెలవాలి'

రాపూరు(డక్కిలి), ఫిబ్రవరి 1 : టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు సతీమణి నారా భువనేశ్వరి శుక్రవారం రాపూరు మండలం చానాయపాళెం పంచాయతీ పరిధిలోని తాతిపల్లికి మధ్యాహ్నం 2.30 గంటలకు వస్తున్నట్లు మండల టీడీపీ అధ్యక్షుడు దందవోలు వెంకటేశ్వర్లు రెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. చంద్రబాబునాయుడు అరెస్టు వార్త విని గుండే ఆగి చనిపోయిన బాధిత కుటుంబాలను పరామర్శిస్తారు. తాతిపల్లి గ్రామంలో సన్నిబోయిన క్రిష్ణయ్య కుటుంబాన్ని పరామర్శించి రూ.3 లక్షల చెక్కును అందచేస్తారని తెలిపారు. కాగా, మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ ఆధ్వర్యంలో జరిగే నిజం గెలవాలి కార్యక్రమానికి టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు.

వైభవంగా గొబ్బెమ్మ 16 రోజుల పండుగ

పొదలకూరు, ఫిబ్రవరి 1 : మండలంలోని మొగళ్లూరులో బుధవారం రాత్రి గొబ్బెమ్మ కొలుపులో భాగంగా 16 రోజుల పండుగ వైభవంగా నిర్వహించారు. సంక్రాంతి సందర్భంగా గొబ్బెమ్మ కొలుపు నిర్వహించి, కనుమ రోజున నిమజ్జనం చేసిన సంగతి తెలిసిందే. 16 రోజుల పండుగలో ఆటపాటలతో సందడి చేశారు.

నెల్లూరు సిటీ, రూరల్ కోవూరు, సర్వేపల్లి

డేంజర్ జంక్షన్



- భగత్‌సింగ్‌కాలనీ వద్ద ప్రమాదకరంగా హైవే కూడలి
- జగనన్న కాలనీ ఏర్పాటుతో పెరిగిన రద్దీ
- తరచూ ప్రమాదాలు, పలువురు మృతి
- వరదలకు దెబ్బతిన్న అండర్‌పాస్ రోడ్డు



నిరుపయోగంగా మారిన హైవే అండర్‌పాస్

నెల్లూరు (వెంకటేశ్వరపురం), ఫిబ్రవరి 1 : నగరంలో వెంకటేశ్వరపురం పరిధిలోని భగత్‌సింగ్ కాలనీ సమీపంలో జాతీయ రహదారి కూడలి ప్రమా దకరంగా మారింది. ఈ ప్రాంతంలో తరచూ ప్రమాదాల జరుగుతున్నాయి. ఇప్పటికే పలువురు ప్రాణాలు కోల్పోయారు. ఆ ప్రాంతంలో హైవేకు ఇరువైపుల జగనన్న కాలనీలు ఏర్పాటు చేయడం, సమీపంలోనే టిడ్కో గృహాలు ఉండటం తో ఇక్కడ రద్దీ పెరిగింది. నిత్యం వేలాది మంది ప్రజలు జాతీయ రహదారి దాటుతున్నారు. ఈ క్రమంలో వేగంగా వస్తున్న వాహనాలతో ప్రమాదాలు జరు గుతున్నాయి. అయితే ఈ ప్రాంతంలో ట్రాఫిక్ సిగ్నల్స్‌గానీ, పోలీసు సిబ్బంది గానీ లేకపోవడంతో ప్రమాదాల్లో అనేక మంది ప్రాణాలు కోల్పోతున్నారు.

వరదలకు దెబ్బతిన్న అండర్ పాస్

జాతీయ రహదారికి ఇరువైపుల వెళ్లేందుకు ఈ ప్రాంతంలో ఎప్పటి నుంచో అండర్‌పాస్ బ్రిడ్జి ఉంది. ఇందులోంచి ద్విచక్ర వాహనదారులు, పాదచారులు వెళ్లేవారు. అయితే పెన్నానదికి వచ్చిన వరదల కారణంగా అండర్ పాస్ రోడ్డు పూర్తిగా దెబ్బతిన్నది. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో వాహనదారులు జాతీయ రహదారిని దాటాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో ప్రమాదాలబారిన పడుతున్నా రు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, పాలకులు స్పందించి అండర్‌పాస్ రోడ్డుకు మరమ్మతులు చేయించాల్సి ఉంది. అదేవిధంగా ఈ కూడలిలో పోలీసుల గస్తీని ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

టీడీపీ ప్రభుత్వం రాగానే ప్రతి ఒక్కరికీ ఇల్లు

● మాజీ మంత్రి నారాయణ



రిక్షా తొక్కుతున్న మాజీ మంత్రి నారాయణ

నెల్లూరు (వెంకటేశ్వరపురం), ఫిబ్రవరి 1 : రాష్ట్రంలో టీడీపీ అధికారంలోకి రాగానే ప్రతి పేదవాడికి ఇల్లు అందించే బాధ్యత తాను తీసుకుంటానని మాజీ మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. నగరంలోని 51వ డివిజన్ నక్కలోళ్ళ సెంటర్, బోసుబొమ్మ తదితర ప్రాంతాల్లో గురువారం ఆయన పర్యటించారు. బాబు ష్యూరిటీ - భవిష్యత గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటికి వెళ్లి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గతంలో టీడీపీ హయాంలో నగరంలో దాదాపు 43వేల మందికి టిడ్కో నివాసాలను మంజూరు చేశామన్నారు. ఆ ఇళ్ల నిర్మాణం వివిధ దశల్లో ఉండగా ఎన్నికల కోడ్ రావడంతో నిలిచిపోయాయన్నారు. అనంతరం రిక్షా కార్మికుడికి నూతన రిక్షాను అందించారు. అతని కోరిక మేరకు నారాయణ రిక్షా తొక్కుతూ ముందుకు సాగారు. ఈ కార్యక్రమంలో నాయకులు విజేతరెడ్డి, రేవతి, కప్పిర శ్రీనివాసులు, ప్రశాంత్ పాల్గొన్నారు.

కోటంరెడ్డిని కలిసిన 'చాట్ల'

నెల్లూరు(వ్యవసాయం), ఫిబ్రవరి 1 : నెల్లూరు కార్పొరేషన్ కోఆప్షన్ సభ్యుడు చాట్ల నరసింహారావు తన కుమారుడు రాజేష్‌తో కలిసి గురువారం రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. టీడీపీలో చేరమని ఎమ్మెల్యే కోరగా అంగీకరించినట్లు చాట్ల చెప్పారు. కాగా, 23వ డివిజన్ పడారుపల్లిలో ఎమ్మెల్యే కోటం రెడ్డి శ్రీధర్‌రెడ్డి సతీమణి కోటంరెడ్డి సుజితమ్మ, కుమార్తెలు హైందవి, వైష్ణవి గురువారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

చింతారెడ్డిపాళెం జంక్షన్‌లో అండర్‌పాస్

● కేంద్ర మంత్రి గడ్కరిని కలిసిన బీజేపీ నేతలు



గడ్కరీకి వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నాయకులు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), ఫిబ్రవరి 1: నగరంలోని చింతారెడ్డిపాళెం జంక్షన్ వద్ద జాతీయ రహదారిపై వెహికల్ అండర్ పాస్ నిర్మాణానికి కేంద్ర రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ ఆదేశించినట్లు బీజేపీ నాయకులు తెలిపారు. పార్టీ నేతలు పీ సురేంద్రరెడ్డి, కుడుములు సుధాకర్ గురువారం ఢిల్లీలో మంత్రిని కలిశారు. చింతారెడ్డిపాళెం జంక్షన్‌లో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, ఇప్పటికే ఎంతో మంది మృతి చెందారని సురేంద్రరెడ్డి కేంద్ర మంత్రికి వివరించారు. ఆ ప్రాంతంలో వెహికల్ అండర్ పాస్ ఏర్పాటుకు వివిధ రాజకీయ పార్టీలు, ప్రజలు నిరసనలు చేపట్టారని తెలియజేశారు. దీంతో స్పందించిన మంత్రి ఆ ప్రాంతంలో వెంటనే వెహికల్ అండర్ పాస్ ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారన్నారు. అలాగే, నెల్లూరు నుంచి కోవూరు వరకు జాతీయ రహదారిని ఆరు వరుసలుగా విస్తరించాలని కూడా కేంద్ర మంత్రిని కోరామని, పరిశీలిస్తామని మంత్రి హామీ ఇచ్చారని నాయకులు తెలిపారు.

ఆకాష్ మృతికి కారకులపై చర్యలు తీసుకోవాలి : ఎమ్మార్పీఎస్



మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు

నెల్లూరు(హరనాథపురం), ఫిబ్రవరి 1: జిల్లాలోని సైదాపురం పోలీసు స్టేషన్‌లో ఆకాష్ రామ్ అనే వ్యక్తి మృతికి కారకులపై చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు సూరిపాక ఉదయ్‌కృష్ణ మాదిగ, ఎంఎస్పీ నాయకుడు పందిటి అంబేడ్కర్ మాదిగ అధికారు లను కోరారు. నగరంలోని అంబేడ్కర్ భవన్‌లో గురువారం ఆకాష్ కుటుంబ సభ్యులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. సైదాపురం పోలీసు స్టేషన్‌లో ఆకాష్ లాకప్ డెత్ జరిగిందని ఆరోపించారు. ఇది జరిగి 8 నెలలు గడుస్తున్నా బాధ్యులైన పోలీసులపై ఇంత వరకు చర్యలు తీసుకోలేదన్నారు. బాధిత కుటుంబానికి తక్షణమే న్యాయం చేయాలని, లేకపోతే చలో సైదాపురం కార్యక్రమానికి పిలుపునిస్తామన్నారు. ఈ సమావేశంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి వడ్లపల్లి ఈశ్వర్‌మాదిగ, జిల్లా ప్రధాన కార్యదర్శి గంగపట్ల సంపద్రి మాదిగ, ఎంఎస్పీ నాయకులు తాళ్లూరు శేషయ్య మాదిగ, ఆర్ చంద్ర మాదిగ పాల్గొన్నారు.

రాజరాజేశ్వరికి విశేష పూజలు



విశేష అలంకరణలో రాజరాజేశ్వరి అమ్మవారు

నెల్లూరు (సాంస్కృతికం), ఫిబ్రవరి 1 : ధర్మప్రచార వారోత్సవాల్లో భాగంగా రాజరాజేశ్వరి అమ్మవారి రథం గురువారం నెల్లూరు రూరల్ మండలం పెద్ద చెరుకూరు లో పర్యటించింది. ఈ సందర్భంగా అమ్మవా రికి విశేష కుంకుమ పూజలు జరిగాయి. ప్రధాన అర్చకుడు రఘురామశర్మ, వేద పండితుడు రామకృష్ణ శర్మ ఆధ్వర్యంలో పూజలు జరిగాయి. ఆలయ చైర్మన్ రత్నం జయరామ్, ధర్మకర్తలు, సహాయ కమిషనర్ శ్రీనివాసులురెడ్డి, సిబ్బంది పర్యవేక్షించారు. కాగా, గురువారంతో ధర్మప్రచార వారోత్సవాలు ముగిశాయి.

ఐరన్ గ్రిల్ విరిగి అవస్థలు

● విజయమహల్ గేటు

అండర్‌పాస్‌లో రాకపోకలకు అసౌకర్యం



నెల్లూరు (సాంస్కృతికం), ఫిబ్రవరి 1 : నిరంతరం వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే విజయ మహల్ గేట్ అండర్ బ్రిడ్జిలో ఐరన్ గ్రిల్స్ దెబ్బతిని ఉన్నాయి. వీటి వల్ల వాహనచోదకులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ వంతెనలో డ్రైనేజీ కాలువపై ఏర్పాటు చేసిన గ్రిల్స్ దెబ్బతిన్న చోట గుంత ఏర్పడింది. అందులో కొన్ని వాహనాలు ఇరుక్కుపోవడంతో ట్రాఫిక్ జామ్ అవుతోంది. నగర పాలక సంస్థ అధికారులు స్పందించి అండర్‌పాస్‌లో గ్రిల్స్ కొత్తవి ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

డీకేడబ్ల్యూ కళాశాలలో రహదారి భద్రత వారోత్సవాలు

నెల్లూరు (విద్య), ఫిబ్రవరి 1 : నగరంలోని డీకే ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో గురువారం రవాణాశాఖ ఆధ్వర్యంలో జాతీయ రహదారి భద్రత వారోత్సవాలు నిర్వహించారు. రవాణాశాఖ అధికారులు వైవీ పూర్ణచంద్రరావు, స్వప్నిల్‌రెడ్డి, కార్తీక్ మాట్లాడుతూ వాహనాలు నడిపే సమయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు రోడ్డు నియమాలను తెలియచేసి ప్రమాదాల నివారణకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ స్వరూప, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఏవీ రమణరావు, పీఆర్వో జోజి, సిబ్బంది పాల్గొన్నారు.

'రత్నం' విద్యార్థుల ర్యాలీ

రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా ధనలక్ష్మీపురంలోని రత్నం సీబీఎస్‌ఈ పాఠశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. హెచ్ఎం రాజేశ్వరి మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలతో ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. విద్యార్థులు రోడ్డు ప్రమాదాలపై ప్లకార్డులు ప్రదర్శిస్తూ స్థానికులకు అవగాహన కల్పించారు.

చెట్ల టెండర్లకు ఆహ్వానం

నెల్లూరు (విద్య), ఫిబ్రవరి 1 : మిచౌంగ్ తుపాను సమయంలో నగరంలోని డీకే ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో నేలకొరిగిన వృక్షాల అమ్మకానికి రూ.1.25లక్షల అంచనా విలువతో ఆన్‌లైన్ ద్వారా టెండర్లను ఆహ్వానిస్తున్నట్లు ఆ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఏవీ రమణరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. టెండర్ దరఖాస్తు, ఇతర వివరాలకు ఈనెల 17వతేదీలోపు 9948121701, 9440090838 నెంబర్లనుగానీ, కళాశాలలోగానీ సంప్రదించాలని కోరారు.

అప్రెంటీస్ విధానం వద్దు

నెల్లూరు (విద్య), ఫిబ్రవరి 1 : ఉపాధ్యాయులు ఏళ్లతరబడి పోరాటాలు చేసి రద్దు చేయించుకున్న అప్రెంటీస్ విధానాన్ని వైసీపీ ప్రభుత్వం పునరుద్ధరించాలనుకోవడం అన్యాయమని, ఆ ఆలోచన మానుకోవాలని బీటీఏ జిల్లా అధ్యక్షకార్యదర్శులు మణిసుబ్బు, మాసా ప్రసాద్ ఓ ప్రకటనలో కోరారు. ఎన్నికలకు ముందు అబద్దాలు పలికి అధికారంలోకి వచ్చాక హామీలను నెరవేర్చమన్నందుకు ఉపాధ్యాయ, ఉద్యోగులను వైసీపీ ప్రభుత్వం వేధి స్తోందని ఆరోపించారు. అప్రెంటీస్ విధానం అమలు ఆలోచనను విరమించుకోకుంటే ఉద్యమిస్తామని హెచ్చరించారు.

నారాయణరెడ్డిపేటలో అభివృద్ధి పనులు


నెల్లూరు రూరల్, ఫిబ్రవరి 1 : నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని 1వ డివిజన్ నారాయణరెడ్డిపేటలో గురువారం ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి, నగర మేయర్ స్రవంతి పర్యటించారు. రూ.75 లక్షల విలువైన అభివృద్ధి పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, కార్పొరేటర్ జానా నాగరాజు, నాయకులు కోడూరు కమలాకర్‌రెడ్డి, లేబూరు పరమేశ్వర రెడ్డి, వాల్మికి లక్ష్మీనరసారెడ్డి పాల్గొన్నారు.

వృద్ధురాలి మెడలో బంగారు గొలుసుల చోరీ

నెల్లూరు(క్రైం), ఫిబ్రవరి 1: ఓ వృద్ధురాలి మెడలో బంగారు గొలుసులను గుర్తుతెలియని దుండగలు తెంపుకెళ్లిన ఘటన గురువారం నగరంలోని జగదీష్‌నగర్‌లో జరిగింది. పోలీసుల సమాచారం మేరకు... జగదీష్‌నగర్‌లోని వెంకటేశ్వర గ్రాండ్ అపార్ట్‌మెంట్‌లో సుజాతమ్మ కుటుంబం నివసిస్తోంది. ఆమె గురువారం పిండి ఆడించుకునేందుకు అపార్ట్‌మెంట్‌కు సమీపంలోని పిండి మిల్లుకు వెళ్లింది. పిండి ఆడించుకుని తిరిగి ఇంటికి నడుచుకుంటూ వస్తుండగా జగదీష్‌నగర్ రోడ్డు వద్దకు వచ్చే సరికి గుర్తుతెలియని ఇద్దరు వ్యక్తులు బైక్‌పై వచ్చి అడ్రస్ అడుగుతూ ఆమె మెడలోని సుమారు రూ.3లక్షల విలువ చేసే ఆరు సవర్ల బంగారు గొలుసు, నల్లపూసల దండను తెంపుకెళ్లారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు బాలాజీనగర్ ఎస్ఐ మహబూబ్ సుభాని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వెల్‌నెస్ భవన నిర్మాణం బిల్లులు చెల్లించాలి

సైదాపురం, ఫిబ్రవరి 1: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ పలుగోటి పెంచలమ్మ అధ్యక్షతన గురువారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. వెల్‌నెస్ భవనం నిర్మాణ పనులు చేపట్టినా బిల్లులు రావడం లేదని పంచాయతీ ఏఈ వీరమణిపై మర్లపూడి ఎంపీటీసీ కుంచం శ్రీనివాసులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలో అక్రమంగా తెల్లరాయి తరలుతున్నా అధికారులు పట్టించకోవడం లేదని జడ్పీటీసీ సభ్యుడు పోలయ్య అధికారులపై అసంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో పురుషోత్తం శివకుమార్, వైస్ ఎంపీపీలు తిరకాల భాస్కర్, ఈశ్వరమ్మ, మండల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.





పక్షులకు స్వర్గం.. ఈ మురికి జలదుర్గం








అది నేలపట్టూ కాదు, పులికాట్ సరస్సూ కాదు. తిరుపతి నడి నగరంలోని ఒక చిన్న ప్రదేశం. ఊరి మురుగంతా వచ్చి చేరి మడుగుగా మారడంతో చేపాజెల్లా పెరుగుతోంది. పురుగూ పుట్రా తారాడుతోంది. చెరువులన్నింటినీ దిగమింగేసిన నగరంలో ఆ చారెడు నీటి మడుగే వందల కొంగలకు, రకరకాల పిట్టలకు ఆవాసంగా మారింది. గుంటలో ఈదులాడుతూ, ముళ్ల పొదలమీద వాలుతూ, పశువుల వీపులపై ఊరేగుతూ, ఆకాశంలో విహరిస్తూ.. ఆ ప్రాంతాన్ని కనువిందుగా మారుస్తున్నాయి. పద్మావతి కళ్యాణమండపాల పక్కన చేపల దుకాణాల వెనుక మరం స్థలంలో ఉన్న ఈ మురిగ్గుంట నుంచి తట్టుకోలేని వాసన వస్తున్నా.. ఈ రెక్కల పిట్టల గుంపుల విన్యాసాలు మాత్రం చూపరులను ఆహ్లాదపరుస్తున్నాయి. ఈపొద్దో రేపో కబ్జారాయుళ్ల కన్ను పడితే.. పాపం ఈ గుంటెడు జలదుర్గం కూడా వీటికి కరువవుతుంది.

- తిరుపతి



వెంకటగిరి ఓటరు జాబితాలో మృతుల పేర్లు



చనిపోయినా చెదరని ఓటు!

తుది ఓటర్ల జాబితా తప్పుల తడకగానే కనిపిస్తోంది. ఫిర్యాదులు అధికంగా వచ్చిన చంద్రగిరి, తిరుపతి నియోజకవర్గాల్లోనే కాకుండా ఫిర్యాదులు లేని వెంకటగిరి, గూడూరు వంటి నియోజకవర్గాల్లో కూడా జాబితాల్లో అనేక తప్పిదాలు చోటుచేసుకున్నాయి. దీంతో జిల్లావ్యాప్తంగా ఓటర్ల జాబితా తయారీలో అధికారులు, ఉద్యోగులు నిర్లక్ష్యంగా, ఉదాసీనంగా పనిచేసినట్టు స్పష్టమవుతోంది. కేంద్ర ఎన్నికల సంఘం పదేపదే హెచ్చరికలు జారీ కావడం, తిరుపతి ఎంపీ ఉప ఎన్నికల అక్రమాలపై ఇపుడు చర్యలకు దిగడం వంటి పరిణామాలు కూడా జిల్లా అధికార యంత్రాంగాన్ని కదలించలేక పోయాయని తాజా ఓటర్ల జాబితా నిరూపిస్తోంది.

తుది ఓటర్ల జాబితాలో తొలగని మృతుల పేర్లు

ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు

గూడూరు/తిరుపతి, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి):వెంకటగిరి, గూడూరు నియోజకవర్గాలకు చెందిన తుది ఓటర్ల జాబితాలో మృతి చెందిన వారి పేర్లు తొలగించలేదు. క్షేత్ర స్థాయిలో టీడీపీ నాయకులు అందజేసిన అభ్యంతరాలు బుట్టదాఖలా అయ్యాయి. ఇటీవల మరణించిన వారి పేర్లు తొలగించలేదంటే సరేనని సరిపెట్టుకోవచ్చు. నాలుగేళ్ల కిందట, రెండేళ్ల కిందట, ఏడాది కిందట చనిపోయిన వారి పేర్లు కూడా జాబితాల్లో నుంచీ తొలగించకపోవడం యంత్రాంగం వైఫల్యమేనని చెప్పాలి. బీఎల్వోలతో డోర్ టు డోర్ వెరిఫికేషన్ చేయించామని అధికారులు చెప్పడం అబద్ధమని తేలుతోంది. వెంకటగిరి, గూడూరు పట్టణాల్లో ప్రాథమికంగా జరిపిన పరిశీలనలోనే పెద్ద సంఖ్యలో మృతుల పేర్లు జాబితాలో నిక్షేపంగా కొనసాగుతుండడం అగుపించింది.


వెంకటగిరిలో.....

వెంకటగిరి పట్టణం పోలింగ్ కేంద్రం నంబరు 280 పరిధిలో 8వ వార్డు, ఏపీటీఎఫ్ కాలనీ, ఇంటి నంబరు 3-267 చిరునామాతో ఓటరు సీరియల్ నంబరు 183, ఎపిక్ నంబరు జీటీజీ 2423531 తదితర వివరాలతో వాకటి వేణుగోపాల్ పేరు నమోదై వుంది. అయితే ఆయన నాలుగేళ్ళ కిందటే మరణించారు.

● అదే పోలింగ్ కేంద్రం, వార్డు, ఏపీటీఎఫ్ కాలనీలో ఇంటి నంబరు 3-22 చిరునామా, ఓటరు సీరియల్ నంబరు 123, ఎపిక్ నంబరు జీటీజీ 1824077 తదితర వివరాలతో మందలపు కృష్ణమనాయుడు పేరు ఓటరుగా నమోదైంది. ఆయన కూడా చనిపోయి నాలుగేళ్ళవుతోంది.

● అదే పోలింగ్ స్టేషన్, అదే వార్డు, రైల్వే క్వార్టర్స్ చిరునామాతో ఓటరు సీరియల్ నంబరు 103, ఎపిక్ నంబరు వైఆర్ఎల్1043751 వివరాలతో పెట్లూరు సిద్ధయ్య పేరు కొనసాగుతోంది.ఆయన మర ణించి ఏడాదవుతోంది.● ఆ పోలింగ్ కేంద్రం పరిధిలోనే 7వ వార్డు కోళ్ళఫారం ఏరియాలో ఇంటి నంబ రు 4-72 చిరునామా, ఓటరు సీరియల్ నంబరు 246, ఎపిక్ నంబరు వైఆర్ఎల్ 0889188 తదితర వివరాలతో షేక్ రజా ఓటరుగా కొనసాగుతున్నారు. వాస్తవానికి ఆయన ఏడాది క్రితమే కన్నుమూశారు.

పదేళ్ళ కిందటి చిరునామాతో వలంటీరుకు ఓటు




వెంకటగిరి పట్టణం 261వ నంబరు పోలిం గ్ కేంద్రం, ఇంటి నంబరు 24-133 చిరునామా, ఓటరు సీరియల్ నంబరు 291, ఎపిక్ నంబరు వైఆర్ ఎల్ 1572403 తదితర వివరాలతో చేపూరు బాలాజీ పేరు ఓటరు జాబితాలో కొనసాగుతోంది. వాస్తవానికి అతడి కుటుంబం పదేళ్ల కిందట ఈ చిరునామాలో నివాసముండేది. పదేళ్ళ కిందట బాలాజీ కుటుంబం 14వ వార్డుకు వెళ్ళిపోయి అక్కడే నివాసముంటోంది. ఆ వార్డులోనే అతడు వలంటీరుగా కూడా పనిచేస్తున్నాడు. స్థానికంగా నివాసం లేరని, జాబితా నుంచీ అతడి పేరు తొలగించాలని 24వ వార్డుకు చెందిన టీడీపీ నాయకులు ఫిర్యాదు చేసినా తొలగించలేదు.



తల్లిదండ్రుల పేర్లు ఓకే... కొడుకులిద్దరివీ తొలగింపు


వెంకటగిరి పట్టణం 261వ నంబరు పోలింగ్ కేంద్రం పరిధిలో 24వ వార్డు సాలివీధికి చెందిన ఇంటి నంబరు 15-142 చిరునామాలో సామల లక్ష్మీపతి కుటుంబం నివాసముంటోంది. ఇంట్లో ఆయనతో పాటు భార్య, కుమారులు వెంకట మురళీ సాయికృష్ణ (వయసు 24, ఓటరు సీరియల్ నంబరు 24, ఎపిక్ నంబరు వైఆర్ఎల్ 2307395), వెంకటసాయి తరుణ్ (వయసు 22, ఓటరు సీరియల్ నంబరు 23, ఎపిక్ నంబరు వైఆర్ఎల్ 2307098) కూడా నివాసముంటున్నారు. వీరు నలుగురి పేర్లూ ఇదివరకూ ఓటరు జాబితాలో నమోదయ్యాయి. అయితే తుది జాబితాలో చూస్తే తల్లిదండ్రుల పేర్లు కొనసాగుతుండగా ఇద్దరు కొడుకుల పేర్లూ తొలగించి వున్నాయి.

గూడూరులో



● గూడూరు పట్టణం 64వ నంబరు పోలింగ్ కేంద్రం, సొసైటీ కాలనీలో ఇంటి నంబరు 15-5-70 చిరునామా, ఓటరు సీరియల్ నంబరు 401, ఎపిక్ నంబరు వైఏఈ 0541540 తదితర వివరాలతో ఒగ్గు విశ్వనాధ ఓటరుగా కొనసాగుతున్నారు. నిజానికి ఆయన రెండేళ్ళ కిందట మరణించారు.


● ఇదే పోలింగ్ కేంద్రం పరిధిలోని వరదానగర్‌లో ఇంటి నంబరు 15-5-76 చిరునామా, ఓటరు సీరియల్ నంబరు 405, ఎపిక్ నంబరు వైఏఈ 0480848 తదితర వివరాలతో గండవరం మస్తాన్‌రెడ్డి పేరు ఓటరు జాబితాలో నమోదై వుంది. ఆయన ఏడెనిమిది నెలల కిందటే మరణించారు.






31వ బూత్‌లో మృతిచెందిన వారి ఓట్లు

● గూడూరు పట్టణంలోని 31వ పోలింగ్ బూత్‌లో మొత్తం 731 ఓట్లున్నాయి. ఈ బూత్ పరిధిలోని ఓటర్ల జాబితా సీరియల్ నెంబరు 286లో ధూర్జటినగర్ ప్రాంతానికి చెందిన వెంగయ్య ఐదేళ్ల క్రితం మృతి చెందినా ఇంకా ఓటరుగానే కొనసాగుతున్నాడు. ఇదే ప్రాంతానికి చెందిన సురేంద్ర నాలుగేళ్ల క్రితం మృతిచెందగా 673 సీరియల్ నెంబరులో, రాజయ్య ఆరేళ్ల క్రితం మృతిచెందినా సీరియల్ నెంబరు 676లో ఓటర్లుగానే నమోదై ఉన్నారు. ఇదే బూత్‌లో ధూర్జటినగర్ ప్రాంతానికి చెందిన భారతి అనే మహిళకు సీరియల్ నెంబరు 683, 687ల్లో డబుల్ ఎంట్రీగా నమోదై ఉంది. ఇదే బూత్‌లో 29వ బూత్ సాధూపేట ప్రాంతానికి చెందిన అస్మత్ అనే వ్యక్తికి మరో ఓటు ఉంది. అలాగే 29వ బూత్‌కు సంబంధించి సీరియల్ నెంబరు 68లో జనార్దన రెడ్డి కాలనీకి చెందిన సుబ్బయ్య రెండేళ్ల క్రితం, సీరియల్ నెంబరు 476కు చెందిన చంద్రశేఖర్ అనే వ్యక్తి రెండేళ్ల క్రితం మృతి చెందినా ఓటర్ల జాబితా నుంచి తొలగించలేదు.



31వ బూత్‌లో వేరే బూత్‌కు చెందిన వ్యక్తికి ఓటు



31వ బూత్‌లో డబుల్ ఎంట్రీగా నమోదైన మహిళ ఓటు

వెంకటగిరి నియోజకవర్గంలో నేడు నారా భువనేశ్వరి పర్యటన

వెంకటగిరి, ఫిబ్రవరి 1: నిజం గెలవాలి కార్యక్రమంలో భాగంలో టీడీపీ అధినేత చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి శుక్రవారం వెంకటగిరి నియోజకవర్గంలో పర్యటించనున్నారు. ఈ మేరకు వెంకటగిరి టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. చంద్రబాబు అరెస్టుతో గుండెపోటుతో మృతి చెందిన బాధిత కుటుంబీకులను ఆమె పరామర్శిస్తారన్నారు. ఉదయం 11.55 గంటలకు కలువాయిలోని బోలిగర్ల చెన్నయ్య కుటుంబాన్ని, మధ్యాహ్నం 2.30 గంటలకు రాపూరు మండలంలోని శానాయపాలెం పంచాయతీ తాతిపల్లి గ్రామంలోని సన్నిబోయిన కృష్ణయ్య కుటుంబాన్ని పరామర్శిస్తారన్నారు. అనంతరం డక్కిలి, వెంకటగిరి మీదుగా తిరుపతి విమానాశ్రయం చేరుకుని, విమానంలో హైదరాబాదుకు వెళతారని వివరించారు. జనసేన, టీడీపీ నాయకులు అధిక సంఖ్యలో హాజరై, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

సత్యవేడుకు స్థానికులు పనికిరారా?


● వైసీపీలో పెరుగుతున్న అసంతృప్తి

● టికెట్ స్థానికులకే ఇవ్వాలని డిమాండ్

సత్యవేడు, ఫిబ్రవరి 1: సత్యవేడు వైసీపీలో స్థానికేతర అంశం తెరమీదకొచ్చింది. ముక్కూ మొహం తెలియని వాళ్లకు టికెట్ ఇస్తే పనిచేసేది లేదని ఆ పార్టీ కార్యకర్తలు సోషల్ మీడియా వేదికగా తమ వాదనలు వినిపిస్తున్నారు. స్థానికులకే అభ్యర్థిత్వం ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. సత్యవేడు నియోజకవర్గ వైసీపీ సమన్వయ కర్తను రోజుల వ్యవధిలోనే పార్టీ అధిష్ఠానం మారుస్తూ వచ్చిన విషయం తెలిసిందే. బుధవారం వైసీపీ విడుదల చేసిన ఐదవ జాబితాలో సత్యవేడు ఎమ్మెల్యే అభ్యర్థిగా గంగాధర నెల్లూరుకు చెందిన నూకతోటి రాజేష్ పేరు ప్రకటించారు. దీనిపై పార్టీ శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ పార్టీ పెద్దల నిర్ణయంపై ధిక్కార స్వరం వినిపిస్తున్నారు. ఇరవై రోజుల వ్యవధిలో రెండుసార్లు అభ్యర్థులను మార్చడం, కనీసం తమ అభిప్రాయాలనైనా తీసుకోకుండా అభ్యర్థిని నియమించడం పట్ల విస్మయం వ్యక్తం చేస్తూ సోషల్ మీడియాలో అధిష్ఠానాన్ని సూటిగా ప్రశ్నిస్తున్నారు. 2019లో ఎమ్మెల్యే అభ్యర్థిగా ఆదిమూలాన్ని ప్రకటిస్తే గెలిపించాం. ఇప్పుడు ఆయనకాదు గురుమూర్తి అంటే ఒప్పుకున్నాం. అందరికంటే ముందు ఆయనను ప్రసన్నం చేసుకోవాలన్న ఆరాటంతో ఆయనను కలిసి సన్మానించాం. తీరా ఆయన కూడా కాదు ఇంకొకరిని తీసుకొచ్చి ఇతనే మీ అభ్యర్థి అంటే మీకంటికి మేం ఎలా కనిపిస్తున్నామంటూ ఓ రేంజ్‌లో ఫైర్ అవుతున్నారు. దీంతో కొత్త అభ్యర్థిని ప్రకటించినా ఎక్కడా సందడి వాతావరణం లేకుండా నిశ్శబ్దం అలుముకుని, కేడర్ నైరాశ్యంలోకి వెళ్ళిపోయింది. అభ్యర్థి మార్పుతో కీలక పెద్దనేత తీరుపై నిరసన స్వరం సర్వత్రా వ్యక్తమవుతోంది.పెద్దిరెడ్డిని ధిక్కరించిన ఆదిమూలం దిష్టిబొమ్మలు కాల్చి, తమ అభ్యర్థి గురుమూర్తేనని, అప్పుడే గెలిచి పోయినట్లు రెండు రోజులుగా నేతలు సంబరాలు కూడా చేసుకున్నారు. బుధవారం రాత్రి వరకు ధీమాగా ఉన్న వైసీపీ నాయకులు కొత్త అభ్యర్థి ప్రకటనతో దీనంగా మౌనందాల్చారు. దీంతో నియోజకవర్గంలో పార్టీ ఒక్కసారిగా డీలా పడిపోయింది. ఆదిమూలం దెబ్బతో నియోజకవర్గంలో మలుపులు తిరుగుతున్న రాజకీయం సర్వత్రా ఆసక్తికరంగా ఉంది.

దళిత వర్గాల్లో పెరుగుతున్న సానుభూతి

పెద్దిరెడ్డిని విభేదించి పార్టీని వీడిన ఆదిమూలంపై వైసీపీలోని ప్రధాన సామాజిక వర్గం చేసిన అమానుష వైఖరి పట్ల దళితవర్గాల్లో ఆయనకు సానుభూతి పెరుగుతోంది. పెద్దిరెడ్డిపై ఆదిమూలం చేసిన విమర్శలను జీర్ణించుకోలేని ప్రధాన సామాజిక వర్గ నేతలు ఆయన దిష్టిబొమ్మలను కాల్చ డం, పార్టీకి పట్టిన శని పోయిందని వ్యాఖ్యలు చేయడం పట్ల దళిత సామాజికవర్గంలో ఆదిమూలంపై అమాంతం సానుభూతి పెరిగింది. ఈ పరిణామాలతో ఎమ్మెల్యే వర్గీయులతో పాటు పలువురు పార్టీ నేతలు కూడా ఆదిమూలంతో టచ్‌లోకి వెళ్ళిపోయినట్లు సమాచారం.ఎమ్మెల్యే సైతం గుట్టుచప్పుడు కాకుండా తన సామాజిక వర్గం మద్దతు కూడగట్టుకుంటున్నట్లు సమాచారం. ఇదే జరిగితే నియోజకవర్గంలో సగం వైసీపీ ఖాళీ అవుతుందని చర్చించుకుంటున్నారు.



తిరుమలలో రేపటి నుంచి ధార్మిక సదస్సు

తిరుమల, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో శనివారం నుంచి సనాతన ధార్మిక సదస్సు ప్రారంభం కానుంది. హిందూ ధర్మప్రచారం, పరిరక్షణ నిమిత్తం టీటీడీ ఈనెల 3 నుంచి 5వ తేదీ వరకు తిరుమలలోని ఆస్థానమండపంలో సనాతన ధార్మిక సదస్సు నిర్వహించబోతోంది. ఈ మేరకు ఏర్పాట్లు పూర్తి చేసింది. ఇందులో భాగంగా దేశవ్యాప్తంగా ఉన్న 57 మంది పీఠాధి, మఠాధిపతులను, ఆధ్యాత్మిక సంస్థ ప్రతినిధులను టీటీడీ ఇప్పటికే ఆహ్వానించింది. హిందూ ధర్మప్రచారం, పరిరక్షణ, సనాతన హిందూ ధర్మవిలువల వ్యాప్తి పరచడంతో పాటు విశిష్టతను ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు చేపట్టాల్సిన చర్యలు, సలహాలపై సదస్సులో చర్చించనున్నారు. పీఠాధి, మఠాధిపతులకు తగిన ఏర్పాట్లు చేసేందుకు ముగ్గురు సీనియర్ అధికారులతో సమన్వయ కమిటీని ఏర్పాటు చేసింది. ఒకో స్వామిజీకి ఒక లైజన్ అధికారిని నియమించారు. దర్శనం, వసతి, ఆహారం, రవాణా వంటి కమిటీలతో లైజన్ అధికారి సమన్వయం చేసుకుని స్వామిజీలకు తగిన ఏర్పాట్లు చేస్తారు.

ఎస్పీ పరమేశ్వరరెడ్డి బదిలీ

● తిరుపతికి రానున్న ఒంగోలు ఎస్పీ

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 1: తిరుపతి ఎస్పీ పరమేశ్వర రెడ్డి బదిలీ అయ్యారు.2022 ఏప్రిల్ 4వ తేదీన జిల్లా మొదటి ఎస్పీగా ఆయన బాధ్యతలు తీసుకున్నారు. సుమారు 22 నెలలపాటు ఎస్పీగా కొనసాగిన ఆయన్ను ఎన్నికల నేపధ్యంలో పోలీసు శాఖలో జరుగుతున్న బదిలీల్లో భాగంగా ప్రకాశం జిల్లా ఎస్పీగా నియమించారు. ప్రస్తుతం ప్రకాశం జిల్లా ఎస్పీగా పనిచేస్తున్న 2015వ బ్యాచ్‌కు చెందిన మల్లికాగర్గ్‌ను తిరుపతి ఎస్పీగా నియమించారు.

పలువురు డీఎస్పీల బదిలీ

జిల్లాలో పలువురు డీఎస్పీలు బదిలీ కాగా మరికొందరు రానున్నారు. తిరుపతి ఎస్.బి. డీఎస్పీ వి. గిరిధర్ ఏసీబీకి బదిలీ అయ్యారు. తిరుమల డీఎస్పీ ఎస్.భాస్కర్‌రెడ్డి తిరుపతి ఎస్.బి. డీఎస్పీగా నియమితులయ్యారు. గుంటూరు జిల్లాకు చెందిన కె.శ్రీనివాసాచారి డీఎస్పీగా పదోన్నతి పొంది తిరుమలలో నియమితులయ్యారు. గుంటూరు వెస్ట్ డీఎస్పీ బి.ఉమామహేశ్వరరెడ్డి శ్రీకాళహస్తి డీఎస్పీగా నియమితులయ్యారు. నాయుడుపేట డీఎస్పీ ఎం.రాజగోపాలరెడ్డి చిత్తూరుకు బదిలీ కాగా చిత్తూరు ఎస్.బి. డీఎస్పీ వి. శ్రీనివాసరెడ్డి నాయుడుపేట డీఎస్పీగా నియమితులయ్యారు. తిరుపతి ఎస్సీ ఎస్టీ సెల్ డీఎస్పీ ఎం.నాగసుబ్బన్నను వీఆర్‌లో ఉంచారు. తిరుపతి రెడ్ శాండిల్ యాంటీ స్మగ్లింగ్ టాస్క్ ఫోర్స్ (ఆర్ఎస్ఏఎస్‌టీఎఫ్) డీఎస్పీగా పనిచేస్తున్న డి.మురళీధర్ ప్రొద్దుటూరుకు బదిలీ అయ్యారు. చంద్రగిరి డీఎస్పీ టి.డి.యశ్వంత్ తాడేపల్లిగూడేనికి బదిలీ కాగా అక్కడ పనిచేస్తున్న సి.శరత్‌రాజ్ కుమార్ చంద్రగిరి డీఎస్పీగా నియమితులయ్యారు.



పరమేశ్వరరెడ్డి - మల్లికాగర్గ్

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

వేధింపులు మానుకోవాలి: ఆర్పీలు



నిరసన తెలుపుతున్న మెప్మా ఆర్పీలు

గూడూరు, ఫిబ్రవరి 1: అర్బన్ మెప్మా కార్యాలయంలో పనిచేస్తున్న తమపై సిటీమిషన్ మేనేజర్ వేధింపులను మానుకోవాలని రిసోర్స్ పర్సన్ (ఆర్పీ)లు డిమాండ్ చేశారు. గురువారం మున్సిపల్ కార్యాలయం వద్ద వారు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మేనేజర్ తమకు సక్రమంగా జీతాలు వచ్చేందుకు సహకరించడం లేదన్నారు. అడిగిన వారిపై వేధింపులకు పాల్పడుతున్నారని చెప్పారు. ఇప్పటికే ఈ విషయమై ఉన్నతాధికారులకు నివేదించామన్నారు. మహిళ అయి ఉండి, ఇలా ప్రవర్తించడం సరికాదన్నారు. ఇకనైనా ఉన్నతాధికారులు విచారణ చేసి, న్యాయం చేయాలని కోరారు. విజయ, సుమతి, వరలక్ష్మి, చంద్రకళ, ఆసీఫా, భవాని, మంజుల, సంపూర్ణమ్మ తదితరులు పాల్గొన్నారు.

బడా బాబులకు మేలు చేసేలా బడ్జెట్: కాంగ్రెస్



సమావేశంలో పాల్గొన్న కాంగ్రెస్ నేతలు

గూడూరు, ఫిబ్రవరి 1: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ బడా బాబులకు మేలు చేసేలా ఉందని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పంటా శ్రీనివాసులురెడ్డి విమర్శించారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. పేద, మధ్యతరగతి ప్రజలకు ఎటువంటి ప్రయోజనాలు చూపలేదన్నారు. ఇక రాహుల్‌గాంధీ నిర్వహిస్తున్న న్యాయయాత్రను అడ్డుకోవడం సమంజసం కాదన్నారు. ఆయన వాహనంపై రాళ్లతో దాడి చేయడాన్ని ఖండిస్తున్నామన్నారు. పూల చంద్రశేఖర్, వేమయ్య తదితరులు పాల్గొన్నారు.

జాగ్రత్తగా వాహనాలు నడపండి



బైక్ ర్యాలీని ప్రారంభిస్తున్న సీఐ పాపారావు

గూడూరు, ఫిబ్రవరి 1: జాగ్రత్తగా వాహనాలు నడపాలని వాహనదారులకు పట్టణ సీఐ పాపారావు సూచించారు. గురువారం టవర్‌క్లాక్ సెంటర్ వద్ద రవాణాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన భద్రతా మాసోత్సవాల్లో భాగంగా బైక్ ర్యాలీని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. ద్విచక్రవాహనాలను నడిపేవారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. ఎంవీఐ సునీల్, సిబ్బంది పాల్గొన్నారు.

వైసీపీ ప్రభుత్వంలో అన్నీ ఇబ్బందులే: జనసేన



స్థానికురాలికి కరపత్రం అందజేస్తున్న జనసేన నాయకులు

గూడూరు, ఫిబ్రవరి 1: వైసీపీ ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజలూ ఇబ్బందులు పడుతున్నారని ఉమ్మడి నెల్లూరు జిల్లా జనసేన ఉపాధ్యక్షుడు తీగల చంద్రశేఖర్ ఆరోపించారు. గురువారం నరసయ్యగుంట, సనత్‌నగర్ ప్రాంతాల్లో జనసేన ఆధ్వర్యంలో భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. సీఎం జగన్ ఎన్నికల సమయంలో మద్యపానం నిషేధం అని చెప్పి, నాసిరకం మద్యం అమ్మకాలతో ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని మండిపడ్డారు. రానున్న ఎన్నికల్లో జనసేన-టీడీపీ ఉమ్మడి ప్రజాప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం ఖాయమన్నారు. ఇంద్రవర్ధన్, సాయికిరణ్, శివకుమార్, సనత్ వెంకటేశ్వర్లుతదితరులు పాల్గొన్నారు.

పదోన్నతి పొందిన ఈఈకి సన్మానం



గూడూరు, ఫిబ్రవరి 1: గోగినేనిపురంలోని విద్యుత్‌కార్యాలయంలో గురువారం ఈఈ ఇస్మాయిల్ అహ్మద్‌ను ఏపీఈఈయూనియన్-1104 నాయకులు సన్మానించారు. ఈ సందర్భంగా యూనియన్ డివిజన్ కార్యదర్శి శివశంకర్ మాట్లాడుతూ ఇస్మాయిల్ ఎస్ఈగా పదోన్నతి పొందడంతో సన్మానించామన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీధర్‌రాజు, తదితరులతో పాటు జూనియర్ అసిస్టెంట్ సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దారుకు సత్కారం

గూడూరు, ఫిబ్రవరి 1: అన్నమయ్య జిల్లాకు బదిలీ అయిన తహసీల్దారు లీలారాణిని ఆమె కార్యాలయంలో గురువారం పలువురు సన్మానించారు. వీరిలో.. వీరుబోయిన గోపాలకృష్ణయాదవ్, జహంగీర్ తదితరులున్నారు.

క్రికెట్ పోటీల్లో తడకు ద్వితీయ స్థానం



ట్రోఫీ అందజేస్తున్న డీఎస్‌డీవో సయ్యద్ సాహెబ్

తడ, ఫిబ్రవరి 1: ఆడుదాం ఆంధ్రా జిల్లాస్థాయి క్రికెట్, కబడ్డీ పోటీల్లో తడ మండలానికి ద్వితీయ స్థానం దక్కింది. తిరుపతిలో ఈ పోటీలు జరగ్గా, గురువారం జిల్లా స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ అధికారి సయ్యద్ సాహెబ్ చేతుల మీదుగా బహుమతులను క్రీడాకారులు అందుకున్నారు. వీరిని ఎంపీపీ కొలవి రఘురెడ్డి, సర్పంచులు అభినందించారు.

సమస్యలు తక్షణమే పరిష్కరించాలి
ఎంఈవోకి మధ్యాహ్న భోజన కార్మికులు



ఎంఈవో శాంతికి వినతి పత్రం అందజేస్తున్న కార్మికులు

నాయుడుపేట టౌన్, ఫిబ్రవరి 1: తమ సమస్యలు తక్షణమే పరిష్కరించాలని మధ్యాహ్న భోజన కార్మికులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం మండల విద్యాశాఖ కార్యాలయంలో ఎంఈవో శాంతికి వినతిపత్రం అందజేశారు. మధ్యాహ్న భోజన కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి విజయమ్మ మాట్లాడుతూ.. సీఎం జగన్ తన పాదయాత్ర సమయంలో అధికారంలోకి వచ్చిన వెంటనే కార్మికులకు రూ.10వేల వేతనం చెల్లిస్తామని హామీ ఇచ్చి ఉన్నారని చెప్పారు. ఆ హామీని తక్షణమే నెరవేర్చాలని కోరారు. నాయకులు వాణి, రజియా, వెంకటేశ్వర్లు, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నేడు 'సామాజిక తనిఖీ' సభ

వెంకటగిరిటౌన్, ఫిబ్రవరి 1: మండలంలోని 20 పంచాయతీల్లో 2022 ఏప్రిల్ ఒకటి నుంచి 2023 మార్చి 31వ తేదీ వరకు జరిగిన ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ బహిరంగ సభ శుక్రవారం నిర్వహించనున్నారు. ఈ మేరకు నీలకంఠేశ్వర రెడ్డి తెలిపారు. మధ్యాహ్నం ఒంటి గంటకు ఎంపీడీవో కార్యాలయంలో సభ జరుగుతుందన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న జనసేన నాయకులు

జగన్ రెడ్డి చేష్టల మాటేమిటి
నేదురుమల్లీ: జనసేన

వెంకటగిరి, ఫిబ్రవరి 1: జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌ను విమర్శించే ముందు మతిస్థిమితం లేని జగన్‌రెడ్డి చేష్టల మాటేమిటి అని వెంకటగిరి వైసీపీ ఇన్‌చార్జి నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డిని శ్రీకృష్ణదేవరాయ కాపు, బలిజ సంక్షేమసేవా సంఘం అధ్యక్షుడు, జనసేన నాయకుడు తోటా కృష్ణయ్య ప్రశ్నించారు. తూర్పువీధిలో కొత్తగా ప్రారంభించిన పార్టీ కార్యాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఇటీవల జనసేన అధినేతపై నేదురుమల్లి చేసిన వ్యాఖ్యలను ఖండించారు. టీడీపీ, జనసేన కలయికతో ఓటమి భయం పట్టుకున్న జగన్మోహన్‌రెడ్డికి మతి భ్రమించి.. ఉద్యోగులను బదిలీ చేసినట్లు వైసీపీ నేతలను కూడా బదిలీ చేస్తున్నారని ఆరోపించారు. అలాంటి నాయకత్వం కింద పనిచేసే నాయకులు కూడా పవన్ గురించి మాట్లాడటం హాస్యాస్పదమని చెప్పారు. నాయకులు రాధ, రామారావు, అనీల్, కోనా రవిశంకర్, కందాల తిరుపాల్, దుర్గాప్రసాద్, వెంకటేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

● టీడీపీ శ్రేణులకు మాజీ ఎమ్మెల్యే పాశిం పిలుపు



సమావేశంలో ప్రసంగిస్తున్న సునీల్‌కుమార్

కోట, ఫిబ్రవరి 1 : వైసీపీ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని టీడీపీ శ్రేణులకు గూడూరు ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ పిలుపునిచ్చారు. కోటలో గురువారం రాత్రి కోట, వాకాడు, చిట్టమూరు మండలాల బూత్ కన్వీనర్లతో ఆయన సమీక్షించారు. ప్రధానంగా.. సీఎం జగన్‌రెడ్డి.. సైకోపాలన ప్రజలు తెలుసుకోవాలంటే ప్రతి బూత్ కన్వీనర్ ప్రతి ఇంటి గడప తొక్కాలన్నారు. ఇప్పటినుంచే సైనికుల్లా పనిచేయాలని చెప్పారు. రాష్ట్ర కార్యదర్శి కుమారి మాట్లాడుతూ.. గూడూరు నియోజకవర్గంలో ప్రతి కార్యకర్త నిర్లక్ష్యాన్ని వీడి ప్రజల్లోకి వెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో కోట, చిట్టమూరు మండలాల కన్వీనర్లు సర్వోత్తమరెడ్డి, కిషోర్‌నాయుడు, మైనార్టీసెల్ జిల్లా అధ్యక్షుడు జలీల్ అహ్మద్, తీగల సురేష్‌బాబు, వాకా విజయభాస్కర్‌రెడ్డి, నల్లారెడ్డి రాజేష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయాలు చంద్రబాబుతోనే సాధ్యం: టీడీపీ



అశోక్‌కుమార్‌కు స్వాగతం పలుకుతున్న టీడీపీ నాయకులు

గూడూరు, ఫిబ్రవరి 1: అంబేడ్కర్ ఆశయాలు చంద్రబాబుతోనే సాధ్యమవుతాయని మాజీ ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. నెల్లూరుకు చెందిన టీడీపీ నాయకుడు అశోక్‌కుమార్ ఇచ్ఛాపురం నుంచి తిరుమల వరకు నిర్వహిస్తున్న పాదయాత్ర గురువారం గూడూరుకు చేరుకోగా స్థానిక నాయకులు స్వాగతం పలికారు. అశోక్‌కుమార్ మాట్లాడుతూ.. వైసీపీ ప్రభుత్వంలో ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్లు నిర్వీర్యం అయ్యాయని చెప్పారు. రానున్న ఎన్నికల్లో చంద్రబాబు సీఎంగా గెలిచి ఎస్సీ, ఎస్టీలకు అండగా నిలుస్తారని ఈ పాదయాత్ర చేపట్టామన్నారు. కార్యక్రమంలో శీలం కిరణ్‌కుమార్, పులిమి శ్రీనివాసులు, బిల్లు చెంచురామయ్య, వెంకటేశ్వర్లురాజు, నరసింహులు, రవీంద్రరెడ్డి, ప్రణీత్ తదితరులు పాల్గొన్నారు. కాగా.. స్థానిక టీడీపీ కార్యాలయంలో భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంపై గూడూరు పట్టణం, మండలం, చిల్లకూరు మండలం నాయకులకు మాజీ ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో శిక్షణ తరగతులు నిర్వహించారు. బనిగీసాహెబ్‌పేటలో పాశిం సతీమణి సంధ్యారాణి భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. మట్టం శ్రావణి, నూర్జహాన్, గుండాల లీలావతి, శ్రీదేవి, కల్పన, శైలజ తదితరులు పాల్గొన్నారు.

బాలాయపల్లి వైసీపీలో వర్గపోరు మరోమారు బహిర్గతం



సమావేశంలో ప్రసంగిస్తున్న రామ్‌కుమార్ రెడ్డి

బాలాయపల్లి, ఫిబ్రవరి 1: మండలంలోని వైసీపీలో వర్గపోరు మరోమారు బహిర్గతమైంది. గురువారం స్థానిక సచివాలయం వద్ద నిర్వహించిన వైఎస్సార్ ఆసరా కార్యక్రమంలో వెంకటగిరి ఇన్‌చార్జి నేదురుమల్లి రామ్‌కుమార్ రెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ఎంపీపీ గూడూరు భాస్కర్ రెడ్డి, ఏఎంసీ చైర్మన్ సింగంశెట్టి భాస్కర్‌రావు వర్గాలు డుమ్మాకొట్టాయి. ఈ సందర్భంగా రామ్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. ఆసరా కార్యక్రమానికి వెళ్లొద్దంటూ తమవాళ్లు కొందరు దొంగదారుల్లో ఫోన్లు చేసినా ఇంతమంది రావడం జగనన్నపై మీకున్న నమ్మకంఅర్థమవుతోందని చెప్పారు. ఈకార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీవో ప్రమీలారాణి, వెందోటి కార్తిక్ రెడ్డి, రాయి దేవికా చౌదరి, వానా పార్వతి, పల్లంటి రాంబాబు, బాపనపల్లి వెంకటసుబ్బయ్య, వెందోటి సుప్రజ, కాటూరు రామతులసి పాల్గొన్నారు.

సూళ్లూరుపేట రైల్వేస్టేషన్ ఆధునికీకరణ

● 'అమృత్ భారత్' కింద రూ.10 కోట్లతో కొత్త హంగులు



రైల్వేస్టేషన్ ముందు భాగంలో జోరుగా జరుగుతున్న పనులు

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 1: సూళ్లూరుపేట రైల్వేస్టేషన్ రూపురేఖలు మారనున్నాయి. కేంద్ర ప్రభుత్వం అమృత్ భారత్ స్టేషన్ స్కీం కింద ఎంపిక చేయడంతో రూ.10 కోట్లతో ఆధునికీకరణ పనులు మొదలయ్యాయి. స్టేషన్ యాక్సెస్, సర్క్యులేటింగ్ ఏరియాలు, వెయిటింగ్ హాళ్లు, మరుగుదొడ్లు, లిఫ్టులు, ఉచిత వైఫై తదితర సౌకర్యాలను కల్పించనున్నారు. చెన్నై నుంచి ఈ స్టేషన్ మీదుగా నవజీవన్, జనశతాబ్ది, పినాకిని, చార్మినార్ వంటి ఎక్స్‌ప్రెస్ రైళ్లు నడుస్తున్నాయి. ప్రయాణికుల ఆమేరకు రైల్వేస్టేషన్‌లో వసతులు కల్పించాలని స్థానికులతోపాటు షార్ ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులు, వ్యాపారులు పలుసార్లు రైల్వే ఉన్నతాధికారులకు, ప్రజాప్రతినిధులకు విన్నవించారు. మొత్తానికి అమృత్‌భారత్ కింద రైల్వేస్టేషన్ ఎంపిక కావడంతో వీరి కల నెరవేరినట్లయ్యింది.

తూములకు అడ్డుగా
మట్టి బస్తాలు

సాగునీటికి ఇబ్బంది పడుతున్నామన్న తిరుమూరు రైతులు



వాకాడు, ఫిబ్రవరి 1: తూములకు అడ్డుగా మట్టి బస్తాలు వేయడంతో సాగునీటికి ఇబ్బంది పడుతున్నామని తిరుమూరు ఆయకట్టు మాజీ అధ్యక్షుడు కేసీపీ రమణయ్య, రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 60 ఏళ్లుగా పులికాలువ నుంచి వచ్చే సాగునీటిని తిరుమూరు, మల్లాం చెరువులకు ఎలాంటి ఆంక్షలు లేకుండా సమానంగా వినియోగించుకుంటున్నామన్నారు. పదేళ్ల కిందట మల్లాం ఆయకట్టు రైతులు సాగునీటిని రానివ్వకుండా అడ్డుకట్టలు కడితే తిరుమూరు రైతులు వెళ్లి తొలగించారన్నారు. ఆ సమయంలో ఇరువర్గాల రైతుల మధ్య ఘర్షణ జరిగి పలువురికి గాయాలు అయ్యాయన్నారు. దాంతో పోలీసులు గస్తీ ఏర్పాటు చేసి తిరుమూరు ఆయకట్టుకు అందించాల్సిన నీటిని అధికారులు పంపిణీ చేయడంతో సమస్య సర్దుమణిగిందన్నారు. తాజాగా ఇపుడు తూములకు అడ్డుగా మల్లాం రైతులు మట్టి బస్తాలను వేసి, తిరుమూరు చెరువుకు సాగునీటిని రాకుండా అడ్డుకుంటున్నారని వాపోయారు. ఈ సమస్యపై ఇప్పటికే ఇరిగేషన్ అధికారులకు, తహసీల్దార్‌కు, కలెక్టర్‌కు వినతిపత్రాలు అందజేశామన్నారు. ఇకనైనా అధికారులు చొరవచూపి తూములకు అడ్డంగా ఉన్న మట్టి బస్తాలను తొలగించాలన్నారు. లేకుంటే మళ్లీ రైతుల మధ్య ఘర్షణలు జరిగే అవకాశం ఉందని వివరించారు.

ఆశ, అంగన్‌వాడీ వర్కర్లకు ఆయుష్మాన్ భారత్ వర్తింపు

జిల్లాలో 6169కుటుంబాలకు లబ్ధి ● కేంద్ర మధ్యంతర బడ్జెట్‌లో వర్తింపు

తిరుపతి, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం గురువారం పార్లమెంటులో ప్రవేశపెట్టిన 2024-25 మధ్యంతర బడ్జెట్ కారణంగా ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ వర్కర్లు ఆయుష్మాన్ భారత్ పథకానికి అర్హులయ్యారు. జిల్లాలో 6169 ఆశా, అంగన్‌వాడీ వర్కర్ల కుటుంబాలకు దీనివల్ల లబ్ధి కలగనుంది. కేంద్ర ప్రభుత్వం 2018 ఏప్రిల్ నుంచీ దేశవ్యాప్తంగా ఆయుష్మాన్ భారత్ పథకాన్ని అమలు చేస్తోంది. అందులో భాగంగా దారిద్ర్య రేఖకు దిగువన వున్న పేద కుటుంబాలకు వైద్య అవసరాల కోసం ఆయుష్మాన్‌భారత్ కార్డులు జారీ చేస్తోంది. ఆరోగ్య పరమైన అవసరాలకు ఈ కార్డు ద్వారా రూ. 5 లక్షల వరకూ వైద్య సేవలు ఉచితంగా పొందడానికి ఈ పథకం వీలు కల్పిస్తోంది. అయితే ఇప్పటి వరకూ ఈ పథకానికి ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ వర్కర్లు అర్హులు కారు. తాజా బడ్జెట్‌లో కేంద్ర ప్రభుత్వం వీరిని కూడా ఆ పథకం పరిధిలోకి తీసుకొచ్చింది.జిల్లాలో ప్రస్తుతం వైద్య శాఖ పరిధిలో 1705 మంది ఆశా వర్కర్లు పని చేస్తున్నారు. అలాగే 2425 మంది అంగన్‌వాడీ వర్కర్లు, మరో 2041 మంది అంగన్‌వాడీ హెల్పర్లు కలసి 4464 మంది వున్నారు. మూడు కేటగిరీలకు చెందిన వారు మొత్తం 6169 మంది ఆయుష్మాన్ భారత్ పథకం పరిధిలోకి చేరనున్నారు. తద్వారా వారి కుటుంబాలకు అవసరమైన సందర్భాల్లో రూ. 5 లక్షల వరకూ విలువైన వైద్య సేవలను ఆస్పత్రుల్లో పొందడానికి వీలుంటుంది. వైద్య, మహిళా శిశు సంక్షేమ శాఖల పరిధిలో వున్న ఈ వర్కర్లు నిజానికి ఆయా రంగాల్లో ప్రజలకు విశేష సేవలందిస్తున్న సంగతి తెలిసిందే. తాజా కేంద్ర బడ్జెట్ ఆయుష్మాన్ భారత్ పథకాన్ని వర్తింపజేయడం ఆ వర్గాలకు కొంత ఊరటనిచ్చినట్టవుతోంది. కాగా ఇతర రాష్ట్రాల్లో ఆయుష్మాన్ భారత్ పథకం చురుగ్గా అమలవుతుండగా ఏపీలో మందకొడిగా సాగుతోందని సమాచారం. ఇతర రాష్ట్రాల్లో అర్హత పొందిన కుటుంబంలో ప్రతి ఒక్కరికీ విడిగా కార్డు జారీ చేస్తుండగా ఏపీలో మాత్రం కుటుంబానికి ఒక కార్డు చొప్పున జారీ చేస్తున్నారు. పనిలోపనిగా దీన్ని సరిచేయాల్సిన అవసరముంది.

ఎంపీడీవోల బాధ్యతల స్వీకరణ

వెంకటగిరిటౌన్, ఫిబ్రవరి 1: వెంకటగిరి ఎంపీడీవోగా నీలకంఠేశ్వరరెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన పెనుమూరు మండలం నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు.

పెళ్లకూరు: ఎంపీడీవోగా కె.సురేష్‌బాబు గురువారం బాధ్యతలు స్వీకరించారు. తొట్టంబేడు నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు.

క్రికెట్ విజేత తిరుపతి జట్లు

● ముగిసిన ఆడుదాం ఆంధ్రా జిల్లాస్థాయి పోటీలు

తిరుపతి(కొర్లగుంట), ఫిబ్రవరి 1: ఆడుదాం ఆంధ్రా జిల్లాస్థాయి పోటీలు ముగిశాయి. స్థానిక తారకరామ మైదానం, శ్రీనివాస క్రీడా సముదాయంలో బుధ, గురువారాల్లో నిర్వహించిన పోటీలు హోరాహోరీగా సాగాయి. **విజేతల వివరాలిలా..:** క్రికెట్ బాలబాలిక విభాగాల్లో తిరుపతి జట్లు ● వాలీబాల్ బాలుర విభాగంలో చంద్రగిరి, బాలికల విభాగంలో గూడూరు విజయం సాధించాయి. ● కబడ్డీ బాలుర విభాగంలో సత్యవేడు, బాలికల విభాగంలో చంద్రగిరి ●ఖోఖో బాలుర విభాగంలో గూడూరు, బాలికల విభాగంలో నగరి విజయం సాధించాయి. ●బ్యాడ్మింటన్ బాలుర విభాగంలో సూళ్లూరుపేట, బాలికల విభాగంలో తిరుపతి జట్లు గెలుపొందాయి.

వివాహిత హత్య కేసులో భర్త అరెస్టు

ఓజిలి, ఫిబ్రవరి 1: వీర్లగునుపాడులో గత నెల 28వ తేదీన జరిగిన వివాహిత హత్య కేసులో ఆమె భర్త వల్లూరు శివకుమార్‌ను అరెస్టు చేసినట్లు నాయుడుపేట డీఎస్పీ రాజగోపాల్‌రెడ్డి తెలిపారు. ఈమేరకు గురువారం స్థానిక పోలీస్‌స్టేషనలో మీడియాకు వివరాలు తెలిపారు. బాలాయపల్లి మండలం కోటంబేడుకు చెందిన శివకుమార్‌కి ఎనిమిదేళ్ల కిందట వీర్లగునుపాడుకు చెందిన దొరసానమ్మతో వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలున్నారు. భర్త తాగుడుకు బానిసై కుటుంబాన్ని పట్టించుకోక పోవడంతో పిల్లలతో కలిసి భార్య ఐదేళ్లుగా వీర్లగునుపాడులోనే ఉంటోంది. భర్త అప్పుడప్పుడూ వచ్చి వెళుతుండేవాడు. ఈ నేపథ్యంలో భార్యపై అనుమానం పెంచుకుని పథకం ప్రకారం పది రోజుల కిందట గ్రామానికి వచ్చాడు. వంటకోసం కట్టెలు తేవడానికి గతనెల 28వ తేదీన గ్రామానికి సమీపంలోని అటవీ ప్రాంతానికి తన భార్యను, ఆమె మేనత్త మంజులమ్మను తీసుకెళ్లాడు. అక్కడ భార్యతో గొడవకు దిగి, మచ్చుకత్తితో మెడపై, తలపై విచక్షణారహితంగా నరికాడు. ఆమె కేకలు వేయడంతో మంజులమ్మ అక్కడకు రాగా, ఆమెపైనా కత్తితో దాడి చేశాడు. మరోవైపు తీవ్ర రక్తస్రావమైన దొరసానమ్మ అక్కడికక్కడే మృతి చెందింది. వీరి కేకలకు సమీపంలోని పులి మురళి అనే వ్యక్తి రావడంతో నిందితుడు పరారయ్యాడు. కేసు నమోదు చేసిన నాయుడుపేట రూరల్ సీఐ జగన్మోహన్‌రావు, దొరవారిసత్రం ఎస్ఐ తిరుమలరావు తమ బృందంతో నిందితుడి కోసం గాలింపు మొదలుపెట్టారు. బుధవారం నాయుడుపేట మండలం పండ్లూరు క్రాస్ రోడ్డు వద్ద శివకుమార్‌ని పట్టుకుని, అతడిచ్చిన సమాచారంతో హత్యకు ఉపయోగించిన మచ్చుకత్తిని, రక్తపు మరకలున్న టీ-షర్టును స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసును త్వరగా ఛేదించిన నాయుడుపేట రూరల్ సీఐ, దొరవారిసత్రం ఎస్ఐలతోపాటు హెడ్‌కానిస్టేబుల్ నాగరాజు, కానిస్టేబుళ్ల మోహన్, గోవర్ధన్, వెంకటేశ్వర్లు, సుధాకర్, వెంకటేష్‌లను డీఎస్పీ అభినందించారు.



నిందితుడి వివరాలు తెలియజేస్తున్న డీఎస్పీ రాజగోపాల్‌రెడ్డి

పెరుగుతున్న ధాన్యం ధరలు

ఆనందంలో రైతులు



ధాన్యాన్ని లారీకి లోడ్ చేస్తున్న కూలీలు

కోట, ఫిబ్రవరి 1: ధాన్యం ధారలు నాలుగేళ్లతో పోల్చుకుంటే ఈ ఏడాది ప్రారంభంలోనే పెరుగుతుండటంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కోట, వాకాడు, చిట్టమూరు మండలాల్లో ఈ ఏడాది తక్కువ మంది రైతులు బీపీటీ 5204 (పెద్ద జిలకర్ర), షుగర్ లెస్ రకం ధాన్యాన్ని సాగు చేశారు. ప్రస్తుతం వరిపైర్లు పొట్ట, వెన్నుదశలో ఉండగా, కొన్ని గ్రామాల్లో ఇప్పుడిప్పుడే కోతకు వస్తున్నాయి. ప్రస్తుతం బీపీటీ 5204 (పెద్దజిలకర్ర) ప్రారంభ దశలోనే పుట్టి ధాన్యం రూ.24వేలు పలికింది. నెమ్ములు ఉన్న ధాన్యం ఎక్కువగా ఉండటంతో ఇదే ధాన్యం పుట్టి రూ.23,600 పలుకుతుంది. రెండేళ్లలో ఈ పెద్ద జిలకర్ర ధాన్యం పుట్టి రూ.17వేల నుంచి రూ.18వేల వరకు పలికి ఆగిపోయేది. ఇక తెలంగాణకే పరిమితమైన షుగర్‌లెస్ వరిసాగును నాలుగేళ్లుగా ఈ ప్రాంత రైతులు సాగు చేస్తున్నారు. ఈ ధాన్యం కూడా ప్రస్తుతం పుట్టి రూ.25వేలు పలుకుతోంది.

రేపు వెంకటగిరిలో నీటి సరఫరాకు అంతరాయం

వెంకటగిరి, ఫిబ్రవరి 1: వెంకటగిరి మున్సిపాలిటీకి తాగునీటి సరఫరా చేసే సమ్మర్ స్టోరేజ్ ట్యాంకును శుక్రవారం శుభ్రం చేయనున్నారు. దీనివల్ల ట్యాంకుకు నీటిని సరఫరా చేసే మోటర్లు నిలిపివేయనున్నట్లు మున్సిపల్ కమిషనర్ వెంకటరామయ్య ఒక ప్రకటనలో తెలిపారు. దీనివల్ల శనివారం నీటి సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు సహకరించాల్సిందిగా కోరారు.

నేడు మారమ్మ విగ్రహ ప్రతిష్ఠ



కరపత్రాలు విడుదల చేస్తున్న చిగురుపాడు గ్రామస్తులు

నాయుడుపేట టౌన్, ఫిబ్రవరి 1: చిగురుపాడులోని మారమ్మ దేవస్థానంలో శుక్రవారం విగ్రహ ప్రతిష్ఠ, కుంభాభిషేక మహోత్సవం నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. ఈ మేరకు గురువారం ఆలయం వద్ద విగ్రహ ప్రతిష్ఠకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు.

ఇంట్లో చోరీ: రూ.1.54లక్షల అపహరణ

గూడూరు, ఫిబ్రవరి 1: రెండో పట్టణ పరిధిలోని ఇందిరానగర్‌లో గురువారం ఓ ఇంట్లో చోరీ జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు... ఇందిరానగర్‌లో నివాసముంటున్న దీపిక అనే మహిళ బుధవారం రాత్రి ఇంటికి తాళాలు వేసి సమీపంలోని తల్లిదండ్రుల వద్దకెళ్లింది. గురువారం ఉదయం తన ఇంటికి వచ్చేసరికి తాళాలు పగలగొట్టి ఉన్నాయి. లోపలికెళ్లి బీరువాను పరిశీలించగా, అందులోని రూ.1.54లక్షలు కనిపించలేదు. ఈ మేరకు రెండోపట్టణ పోలీసులకు సమాచారం అందించడంతో సంఘటనా స్థలాన్ని డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి, క్లూస్‌టీం సిబ్బంది పరిశీలించారు. విచారిస్తున్నామని సీఐ రవికిరణ్ తెలిపారు.

ఫ్రూట్స్ డే



కోట, ఫిబ్రవరి 1: కోటలోని ప్రగతి విద్యాసంస్థల్లో గురువారం ఫ్రూట్స్ డే నిర్వహించారు. పండ్ల ఆకృతిలో ఉన్న దుస్తులను విద్యార్థులు ధరించి అలరించారు. చైర్మన్ పసుపులేటి కిషోర్, ప్రోగ్రామ్ ఇన్‌చార్జి భాను, ఉపాధ్యాయులు మమత, నిరుపమ పాల్గొన్నారు.

7నుంచి భక్త సమ్మేళనం


సూళ్లూరుపేట, ఫిబ్రవరి 1: ఆచార్య భరద్వాజ సేవాసంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 7 నుంచి 9వ తేదీవరకు సూళ్లూరుపేటలో భక్త సమ్మేళనం నిర్వహించనున్నట్లు ఆచార్య భరద్వాజ సేవాసంస్థ నిర్వాహకుడు ఎంఎం చంద్రబాబు తెలిపారు. ఆచార్య ఎక్కిరాల భరద్వాజ్ 9న షిరిడీలో విశ్వ చైతన్యానుభూతిని పొందిన రోజును పురస్కరించుకుని ఏటా ఈ సమ్మేళనం నిర్వహిస్తారన్నారు.

రామ్మూర్తి స్వామి ఆలయ హుండీ లెక్కింపు

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 1: పట్టణంలోని మద్వేంకట రామ్మూర్తి స్వామి ఆలయ హుండీ ఆదాయాన్ని గురువారం దేవదాయ శాఖ ఆధ్వర్యంలో లెక్కించారు. ఆరు నెలల తొమ్మిది రోజులకుగాను రూ.1,61,670 ఆదాయం వచ్చినట్లు దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసబాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకుడు అనంతకుమార్, నిర్వాహకుడు బీరక రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

వైసీపీ యువజన జిల్లా సెక్రటరీగా భావన్

నాయుడుపేట, ఫిబ్రవరి 1: వైసీపీ యువజన జనరల్ జిల్లా సెక్రటరీగా నాయుడుపేట మున్సిపాలిటీ కోఆప్షన్ మెంబరు భావన్ నియమితులయ్యారు. దాంతో ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్యకు గురువారం భావన్ పుష్పగుచ్ఛం అందజేసి, కృతజ్ఞతలు తెలిపారు.



కిలివేటికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న భావన్